దేశవ్యాప్తంగా 150 దేవాలయాల అభివృద్ధి

రంగంపేట, న్యూస్‌టుడే: దేశవ్యాప్తంగా 150 దేవాలయాల్లో వివిధ అభివృద్ధి పనులు కొనసాగుతున్నాయని కేంద్ర బొగ్గు, గనులశాఖ మంత్రి జి.కిషన్‌రెడ్డి తెలిపారు. సోమవారం వరంగల్ నగర పర్యటనకు విచ్చేసిన కేంద్ర మంత్రి ఓరుగల్లు నగరంలో చరిత్ర ప్రసిద్ధిగాంచిన శ్రీభద్రకాళి అమ్మవారిని దర్శించుకొని పూజలు చేశారు. అనంతరం ఆయన మీడియాతో మాట్లాడుతూ.. దేశంలో అయోధ్య, వారణాసితో పాటు అనేక దేవాలయాలను అభివృద్ధి చేస్తున్నామన్నారు. తెలంగాణలో జోగులాంబ, భద్రాచలం, రామప్ప, బల్కంపేట అమ్మవారి ఆలయాలను అభివృద్ధి పరుస్తున్నట్లు వివరించారు. ప్రతి పండగలో యువత భక్తి శ్రద్ధలతో పాల్గొంటున్నారని, ఆధ్యాత్మిక కార్యక్రమాల్లో పాల్గొనడం వల్ల పెద్దల పట్ల గౌరవం, సంస్కృతి సంప్రదాయాలు తెలుస్తాయన్నారు. కేంద్ర మంత్రిగా ప్రమాణ స్వీకారం చేసిన తర్వాత తొలిసారిగా శ్రీభద్రకాళి అమ్మవారిని దర్శించుకున్నానని, కశ్మీర్ ఎన్నికల ఇన్‌ఛార్జి బాధ్యతలు ఉండటంతో కొంత ఆలస్యమైందని కేంద్ర మంత్రి కిషన్‌రెడ్డి వివరించారు. ప్రధాని మోదీ కూడా అమ్మవారి ఆశీస్సులు తీసుకున్నారని చెప్పారు. కార్యక్రమంలో భాజపా వరంగల్ ఉమ్మడి జిల్లా నాయకులు రావు పద్మ, గంట రవికుమార్, ఎం.ధర్మారావు, డా.విజయచందర్‌రెడ్డి, డా.కాళీప్రసాద్, కొండేటి శ్రీధర్, సత్యపాల్‌రెడ్డి, మాజీ ఎంపీ ఆజ్మీరా సీతారాంనాయక్ తదితరులు పాల్గొన్నారు.


భద్రకాళి అమ్మవారి చెంత కేంద్ర మంత్రి కిషన్‌రెడ్డి, భాజపా నాయకులు

కలాం మాట.. విజయ బావుటా!

నేడు ప్రపంచ విద్యార్థుల దినోత్సవం



పూరి గుడిసెలో.. దీప కాంతుల్లో.. చదువుకున్న ఆ వ్యక్తి ప్రపంచం గర్వించదగ్గ శాస్త్రవేత్త అవుతారని ఎవరూ ఊహించలేదు.. శాస్త్రసాంకేతిక రంగాల్లో అద్భుత విజయాలతో అభిమానం చూరగొని రాష్ట్రపతిగా అత్యున్నత పదవి అలంకరించారు. నిరంతర అధ్యయనం మహోన్నతుడిగా నిలిపింది. అంతేకాదు.. స్ఫూర్తి నింపేలా ప్రసంగాలు చేసి విద్యార్థులను ఆకట్టుకున్నారు. ఆయనే దివంగత మాజీ రాష్ట్రపతి డాక్టర్ అబ్దుల్ కలాం. నేడు ఆ మహనీయుడి జయంతి సందర్భంగా 'ప్రపంచ విద్యార్థుల దినోత్సవం' జరుపుకొంటున్నారు. ఈ నేపథ్యంలో యువతలో స్ఫూర్తినింపే కలాం మాటలు.. ఆ బాటలో సాగుతున్న వారి స్ఫూర్తిగాథలతో 'ఈనాడు' ప్రత్యేక కథనమిది..

–ఈనాడు, మహబూబాబాద్

'యువత ఉద్యోగార్థుల నుంచి ఉపాధి కల్పించే స్థాయికి ఎదగాలి'

పరి'శ్రమ' ఫలించి.. ఉపాధి కల్పిస్తూ..



బీటెక్ విద్య నభ్యసించే యువకులు ఎవరైనా మంచి ఉద్యోగం సాధించాలనే లక్ష్యంగా ముందుకెళ్తారు. కానీ, మహబూబాబాద్ పట్టణానికి చెందిన భూక్య యశ్వంత్‌నాయక్ బీటెక్ రెండో సంవత్సరం చదువుతున్నప్పుడే వ్యాపారవేత్త కావాలని, కొంతమందికి ఉపాధి కల్పించాలని ఆలోచించారు. 2021లో రూ.35 లక్షలతో జూట్ సంచుల తయారీ పరిశ్రమ నెలకొల్పారు. ఎన్ని సమస్యలు వచ్చినా పట్టుదలతో ముందుకెళ్లి.. నేడు 20 మందికి ఉపాధి కల్పిస్తున్నారు.

'విజయం సాధించాలనే సంకల్పం, తగినంత బలం ఉంటే.. వైఫల్యం నన్ను ఎప్పటికీ అధిగమించదు'..



యావత్ దేశం గర్వించేలా..

ఓరుగల్లు యువకుడు ఇరిగేశి అర్జున్ చదరంగంలో ప్రపంచ చెస్ ఒలింపియాడ్ టైటిల్ కైవసం చేసుకొని యావత్ దేశం గర్వించేలా చేశారు.. 2018లో తెలంగాణ నుంచి గ్రాండ్‌మాస్టర్, 2022లో సూపర్ గ్రాండ్‌మాస్టర్ హోదా సాధించిన మొదటి వ్యక్తిగా చరిత్ర సృష్టించారు. 21 ఏళ్ల యువ క్రీడాకారుడు అపజయాలకు కుంగిపోకుండా ప్రత్యర్థుల ఎత్తులను చిత్తు చేస్తున్నారు.

'చిన్న లక్ష్యం నేరం.. లక్ష్యం గొప్పదై ఉండాలి'

అయిదు ఉద్యోగాలు సాధించి..



పలువురికి స్ఫూర్తిగా నిలిచేలా గొప్ప లక్ష్య శిఖరాన్ని ఛేదించేవారు ఎందరో.. అలాంటి వారిలో వరంగల్ జిల్లా నల్లబెల్లి మండల కేంద్రానికి చెందిన వడ్లూరి రమ, ఉపాధ్యాయుడు విష్ణు దంపతుల కుమార్తె శ్వేత ఒకరు. ఈ-సెట్ ఫలితాల్లో రాష్ట్ర స్థాయిలో ప్రథమ స్థానంలో నిలిచి ఎంఈ పూర్తి చేశారు. పోటీ పరీక్షలు రాసి ఐదింటిలో ఉద్యోగాలు సాధించారు. ప్రస్తుతం ఆర్‌అండ్‌బీ శాఖ కరీంనగర్ సబ్ డివిజన్‌లో ఏఈఈగా పనిచేస్తున్నా.. త్వరలోనే పాలిటెక్నిక్ లెక్చరర్‌గా ఉద్యోగంలో చేరి ఎంతో మంది విద్యార్థులను ఆవిష్కర్తలుగా తీర్చుదిద్దుతానని చెప్పారు.

"జీవితంలో కష్టాలను ఎదుర్కొన్నప్పుడే విజయాలను ఆస్వాదించగలం"

వైకల్యాన్ని ఎదిరించి..



వరంగల్ జిల్లా కల్లెడకు చెందిన జీవాంజి దీప్తి పారాలింపిక్స్ కాంస్య పతక విజేత.. తనది నిరుపేద కుటుంబం.. పుట్టుకతోనే మానసిక వైకల్యం.. జీవితంలో ఎన్నో కష్టాలు ఎదురవుతున్నా.. తల్లిదండ్రుల ప్రోత్సాహం, వ్యాయామ ఉపాధ్యాయులు, అథ్లెటిక్స్ కోచ్ శిక్షణలో విజేతగా నిలిచారు. లక్ష్యసాధనలో అడ్డంకులను పరుగుతో ఛేదించారు. అంకితభావంతో డిగ్రీ పూర్తి చేసి ఈ అంతర్జాతీయ స్థాయి క్రీడాకారిణి ఎంతో మందికి స్ఫూర్తిగా నిలుస్తున్నారు.

ఈ ఏడాది అంశం

'విద్యార్థులు చదువు, భవిష్యత్తును తీర్చిదిద్దుకునేలా బాధ్యత ఇద్దాం.. వారిలో శక్తిసామర్థ్యాలను వెలికితీసి నాయకులుగా, ఆవిష్కర్తలుగా ఎదిగేలా ప్రోత్సహిద్దాం..

'కల అంటే మీరు నిద్రపోతున్నప్పుడే చూసేది కాదు.. అది మిమ్మల్ని నిద్రపోనివ్వదు'

'సైన్స్ అనేది మానవాళికి ఒక అందమైన బహుమతి.. మనం దాన్ని వక్రీకరించకూడదు'

పేదరికం అడ్డుకాలేదు



పాఠశాల స్థాయిలో గురువు మొగిలి స్ఫూర్తితో తానూ ఉపాధ్యాయ వృత్తిలోకి రావాలని.. కలలు గని పట్టుదలతో చదివి ఉపాధ్యాయురాలిగా విధుల్లో చేరబోతున్నారు.. వరంగల్ జిల్లా చెన్నారావుపేట మండలం ఉప్పరపల్లికి చెందిన పల్లకొండ శిల్ప.. నిరుపేద కుటుంబానికి చెందిన రవి, భాగ్యల కూతురు.. ఊరిలో సొంతిల్లు కూడా లేదు. చదువుకు పేదరికం అడ్డుకాదని, ప్రభుత్వ బడుల్లో చదువుకుని గురువు సూచనలతో ఇంటర్ తర్వాత టీటీసీ చదివి ఇప్పుడు ప్రభుత్వ ఉపాధ్యాయురాలైంది.

ఆవిష్కరణలు అదుర్స్



మహబూబాబాద్ మండలం కంబాలపల్లికి చెందిన షణ్ముఖరావు చదువుకున్నది పదో తరగతే.. కానీ, గొప్ప ఆవిష్కర్త.. పత్తి, మిర్చిలో కలుపు మొక్కలను తొలగించడానికి యంత్రాన్ని తయారు చేయాలనే ఆలోచనతో 2019లో 'మోనోవీల్ మ్యాన్‌రైడింగ్ పవర్ వీడర్'ను తయారు చేశారు. అంతర్జాతీయ స్థాయిలో బంగారు పతకం పొందారు. ఇప్పటివరకు ప్రజలకు ఉపయోగపడే ఎనిమిది రకాల ఆవిష్కరణలు తయారు చేశారు.

ఉమ్మడి జిల్లాలోని విద్యార్థుల వివరాలు	
పాఠశాలల విద్యార్థులు	4,63,500
జూనియర్ కళాశాలల్లో	1,03,100
డిగ్రీ, ఇంజినీరింగ్, ఫార్మసీలో	1,19,000
పీజీ విద్యార్థులు	11,600

నత్తనడకన భూ క్రమబద్ధీకరణ

భూపాలపల్లి, న్యూస్‌టుడే: జిల్లాలో లే అవుట్ రెగ్యులరైజేషన్ స్కీం(ఎల్ఆర్ఎస్) దరఖాస్తుల విచారణ నత్తనడకన కొనసాగుతోంది. దరఖాస్తుదారులకు సంబంధిత సిబ్బంది విచారణకు రావాలని సమాచారం అందించిన ముందుకు రావడం లేదు. రెవెన్యూ, నీటిపారుదల శాఖ, మున్సిపాలిటీ అధికారుల అనుమతి లేకుండా అక్రమ వెంచర్లు, విక్రయించిన ప్లాట్ల క్రమబద్ధీకరణకు వీలుకల్పించేందుకు గత ప్రభుత్వం ఈ పథకాన్ని ప్రవేశపెట్టింది. రూ.వెయ్యి రుసుంతో ప్లాట్లు, రూ.10 వేల రుసుంతో వెంచర్ల క్రమబద్ధీకరణకు అవకాశం ఇచ్చింది. గత ప్రభుత్వం హయాంలో ఎల్ఆర్ఎస్ జారీ ప్రక్రియ మూలకు పడగా.. కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి రాగానే వీటిని క్రమబద్ధీకరించాలని నిర్ణయించింది. ఈ మేరకు జిల్లా వ్యాప్తంగా 8,145 దరఖాస్తులు వచ్చాయి.


జిల్లా కేంద్రంలో దరఖాస్తు పరిశీలిస్తున్న అధికారులు

జిల్లా వ్యాప్తంగా పదుల సంఖ్యలో..

జిల్లాలో అత్యధికంగా పదుల సంఖ్యలో స్థిరాస్తి వ్యాపారులు వెంచర్లు ఏర్పాటు చేసి, వందల సంఖ్యలో ప్లాట్లు విక్రయించి రూ.లక్షలు దండుకున్నారు. రెవెన్యూ, నీటిపారుదల శాఖలు, మున్సిపాలిటీ పరిధిలో అనుమతి లేకుండా ఏర్పాటు చేసిన వెంచర్లలో ప్రజలు ప్లాట్లు కొనుగోలు చేసిన వాటికి అనుమతి లేని కారణంగా మళ్లీ వాటిని తిరిగి అమ్ముకోలేక పోతున్నారు. భూపాలపల్లి మున్సిపాలిటీ పరిధిలో ఎల్ఆర్ఎస్ క్రమబద్ధీకరణకు అత్యధికంగా 3,771, కాటారం మండలంలో 2,196, గణపురం మండలంలో 1,573 దరఖాస్తులు వచ్చాయి. జిల్లా అధికార యంత్రాంగం దరఖాస్తుల విచారణ 10 రోజుల క్రితం చేపట్టింది. పట్టణ ప్రణాళిక విభాగం అధికారులు, పలు శాఖల సిబ్బంది, పంచాయతీ కార్యదర్శులు, రెవెన్యూ, నీటి పారుదల శాఖ అధికారులు సంయుక్తంగా పరిశీలన ప్రారంభించారు. ఎల్-1 నుంచి ఎల్-4 వరకు నాలుగు దశల్లో విచారణ కొనసాగుతోంది. గ్రామ పంచాయతీ పరిధిలో వచ్చిన దరఖాస్తులను పంచాయతీ కార్యదర్శులు, రెవెన్యూ ఇన్‌స్పెక్టర్ (ఆర్ఐ), నీటి పారుదల శాఖ ఏఈలు పరిశీలిస్తారు. మున్సిపాలిటీ, రెవెన్యూ, నీటి పారుదల శాఖల పరిధిలోని దరఖాస్తులను ఆయా శాఖల అధికారులు పరిశీలించి అనుమతులు జారీ చేస్తారు.

☛ జిల్లాలో 8,145 దరఖాస్తులు రాగా క్షేత్ర స్థాయిలో విచారణకు అనేక ఇబ్బందులు ఎదురవుతున్నాయి. పలువురు కొనుగోలు చేసిన ప్లాట్లకు సంబంధించిన లేఅవుట్ పత్రాలు, ఈసీ పత్రాలను జత చేయకపోవడంతో ప్లాట్లను గుర్తించలేకపోతున్నారు. కొన్ని ఏరియాల్లో ఏర్పాటు చేసిన వెంచర్లు కనిపించకుండా పోయాయి. ఇప్పటి వరకు జిల్లా వ్యాప్తంగా 436 దరఖాస్తులు పరిశీలించారు.

☛ ఈ ప్లాట్లలో ప్రభుత్వ భూమి, చెరువు, కుంట శిఖం, బఫర్ జోన్, స్థానిక అవసరాలకు కేటాయించి ఉంటే అనుమతి ఇవ్వరు. అన్ని సక్రమంగా ఉంటే ఎల్-1 స్థాయిలో క్లియర్ చేసి, ఎల్-2 డీపీవో, డీఎల్‌పీవోలు పరిశీలన చేస్తారు. ఎల్-3 లో స్థానిక సంస్థల అదనపు కలెక్టర్ సరి చూసి ఎల్-4 లో అనుమతి జారీ చేస్తారు.

పూర్తి చేసేందుకు ప్రత్యేక చర్యలు

- సునీల్, పట్టణ ప్రణాళిక అధికారి

ఎల్ఆర్ఎస్ ప్రక్రియ త్వరగా చేపట్టేందుకు చర్యలు తీసుకుంటున్నాం. పది రోజులుగా జిల్లా వ్యాప్తంగా పలు గ్రామాలతో పాటు మున్సిపాలిటీ పరిధిలో విచారణ ప్రారంభించాం. దరఖాస్తులకు కావాల్సిన పత్రాలను జత చేయకపోవడంతో క్షేత్రస్థాయిలో ఇబ్బందులు ఎదురవుతున్నాయి. అన్ని పత్రాలు తీసుకురావాలని దరఖాస్తుదారులకు సమాచారం ఇచ్చిన స్పందించడం లేదు.

'యువత క్రీడలపై దృష్టి సారించాలి'

భూపాలపల్లి, న్యూస్‌టుడే: యువత క్రీడలపై దృష్టి పెట్టాలని, రాష్ట్ర ప్రభుత్వం గ్రామీణ ప్రాంత క్రీడాకారులను ప్రోత్సహిస్తున్నట్లు ఎమ్మెల్యే గండ్ర సత్యనారాయణరావు అన్నారు. ముఖ్యమంత్రి కప్-2024 క్రీడా పోటీలను పురస్కరించుకుని హైదరాబాద్ ఎల్బీ స్టేడియంలో ప్రారంభమైన సీఎం కప్ క్రీడా జ్యోతి ర్యాలీ సోమవారం భూపాలపల్లికి చేరుకుంది. పట్టణంలో క్రీడా జ్యోతి ర్యాలీకి కలెక్టర్ రాహుల్ శర్మతో పాటు ఎమ్మెల్యే గండ్ర సత్యనారాయణరావు, జిల్లా యువజన క్రీడల అధికారి, వ్యాయామ ఉపాధ్యాయులు ఘనస్వాగతం పలికారు. కలెక్టర్‌తో పాటు ఎమ్మెల్యే జెండా ఊపి ర్యాలీని ప్రారంభించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ.. గ్రామీణ ప్రాంత క్రీడాకారులను ప్రోత్సహించేందుకు నవంబర్‌లో సీఎం కప్ పోటీలు నిర్వహిస్తున్నట్లు తెలిపారు. స్పోర్ట్స్ యూనివర్సిటీ ఏర్పాటుతో రాష్ట్రంలోని క్రీడాకారులకు మేలు జరుగుతుందన్నారు. ఈ పోటీల్లో మారుమూల పల్లెలు, గ్రామాలు, పట్టణాలకు చెందిన యువత పాల్గొనేలా అవగాహన కల్పించడమే క్రీడా జ్యోతి ర్యాలీ ముఖ్య ఉద్దేశమని కలెక్టర్ వివరించారు. యువత సద్వినియోగం చేసుకోవాలన్నారు. కార్యక్రమంలో రాష్ట్ర క్రీడల అధికారులు మధు, బోస్, భూపాలపల్లి డీఎస్పీ సంపత్‌రావు, జిల్లా యువజన క్రీడల అధికారి జయపాల్, ఎస్‌జీఎఫ్ జిల్లా కార్యదర్శి రమేష్, అధికారులు, కౌన్సిలర్లు పాల్గొన్నారు.



ర్యాలీలో కలెక్టర్ రాహుల్ శర్మ, ఎమ్మెల్యే జీఎస్సార్

ప్రశంసాపత్రాల అందజేత..

కలెక్టరేట్‌లో సోమవారం పర్వతారోహకులను కలెక్టర్ రాహుల్ శర్మ అభినందించారు. హిమాచల్ ప్రదేశ్‌లోని మనాలీ ప్రాంతంలో 14600 అడుగులు (4250 మీటర్ల ఎత్తు) కలిగిన 'మౌంట్ పథల్స్' పర్వతం అధిరోహించిన జిల్లాకు చెందిన కె.విశాల్, ఎం.లక్కి, పి.సీతారాంకు కలెక్టర్ ప్రశంసా పత్రాలు అందజేశారు. కార్యక్రమంలో జిల్లా క్రీడల అధికారి జయపాల్, ఖేల్ ఇండియా సెంటర్ కో ఆర్డినేటర్ శ్రీనివాస్‌రెడ్డి, శివసాగర్ పాల్గొన్నారు.

ప్రజా సమస్యల పరిష్కారానికి కృషి

భూపాలపల్లి, న్యూస్‌టుడే: ఎంతో నమ్మకంతో వివిధ గ్రామాల నుంచి సమస్యల పరిష్కారం కోసం వస్తున్న వారి సమస్యలను క్షేత్రస్థాయిలో విచారించి పరిష్కరించాలని జిల్లా ఎస్పీ కిరణ్ ఖరే సంబంధిత అధికారులను ఆదేశించారు. సోమవారం జిల్లా పోలీసు కార్యాలయంలో నిర్వహించిన ప్రజా దివాస్ కార్యక్రమంలో జిల్లా నుంచి 12 ఫిర్యాదులను ఎస్పీ స్వీకరించారు. చట్టప్రకారం వాటిని పరిష్కరించాలని సంబంధిత ఎస్సై, సీఐలకు చరవాణిలో సమాచారం అందించారు. .


బాధితుల వివరాలు తెలుసుకుంటున్న ఎస్పీ కిరణ్ ఖరే

నేడు పాఠశాలల కేటాయింపు

భూపాలపల్లి, న్యూస్‌టుడే: డీఎస్సీ 2024లో ఎంపికై ఉత్తర్వులు తీసుకున్న అభ్యర్థులు జిల్లా కేంద్రంలోని ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో నేడు (మంగళవారం) నిర్వహించే కౌన్సెలింగ్‌కు హాజరు కావాలని జిల్లా విద్యాశాఖ అధికారి ఎం.రాజేందర్ ఒక ప్రకటనలో తెలిపారు. ఉదయం 10 గంటలకు అన్ని కేటగిరీలకు చెందిన అభ్యర్థులు వారి ధ్రువపత్రాలతో హాజరుకావాలని సూచించారు. జిల్లా నుంచి ఎంపికైన మొత్తం 212 మంది అభ్యర్థులు కౌన్సెలింగ్‌కు రావాలని పేర్కొన్నారు.

దరఖాస్తుల ఆహ్వానం

ఏటూరునాగారం, న్యూస్‌టుడే: ఏటూరునాగారం ఆర్ఐటీఐలో కొత్తగా ప్రవేశ పెట్టిన అడ్వాన్స్‌డ్ టెక్నాలజీ కోర్సులలో ప్రవేశానికి ఆన్‌లైన్లో దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు ప్రిన్సిపల్ ఎస్.జగన్‌మోహన్‌రెడ్డి పేర్కొన్నారు. కోర్సులు మాన్యుఫ్యాక్చరింగ్ కంట్రోల్ ఆటోమేషన్, ఇండస్ట్రియల్ రోబోటిక్స్ అండ్ మాన్యుఫ్యాక్చరింగ్, ఆర్టిజన్యూసింగ్ అడ్వాన్స్‌డ్ టూల్స్, బేసిక్ డిజైనర్ వర్చువల్ వెరిఫైయర్, అడ్వాన్స్‌డ్ యానిమేషన్ టెక్నీషియన్, మెకానిక్ ఎలక్ట్రికల్ వెహికల్ కోర్సుల్లో సీట్లు అందుబాటులో ఉన్నాయని, ఈ నెల 15 నుంచి 19 వరకు నిర్వహించనున్న ఇంటర్వ్యూకు హాజరై ప్రవేశం పొందాలన్నారు. పదో తరగతి ఉత్తీర్ణులైన అభ్యర్థులు అర్హులని, www.iti.telangana.gov.in లో దరఖాస్తు చేసుకోవాలన్నారు.

అర్జీలు ఇచ్చాం.. ఆలకించండి!

భూపాలపల్లి కలెక్టరేట్, న్యూస్‌టుడే: ప్రజావాణి దరఖాస్తులను పరిష్కరించి అర్జీదారులకు తగిన న్యాయం చేయాలని కలెక్టర్ రాహుల్ శర్మ అధికారులను ఆదేశించారు. సోమవారం ఐడీఓసీ కార్యాలయ సమావేశ మందిరంలో నిర్వహించిన ప్రజావాణి కార్యక్రమంలో వివిధ ప్రాంతాల నుంచి వచ్చిన ప్రజల వినతులను స్వీకరించారు. జంగేడుకు చెందిన పైడిపాల సుధాకర్ అనే దివ్యాంగుడు మూడు చక్రాల సైకిల్ కోసం దరఖాస్తు చేసుకోగా పరిశీలించి సంక్షేమ అధికారి చిన్నయ్య వెంటనే మూడు చక్రాల సైకిల్‌ను అందజేశారు. ఎస్సారెస్పీ కాలువ 5.20 ఎకరాల నీటికుంట నుంచి అక్రమంగా పైపులైన్ ద్వారా సొంత అవసరాలకు వినియోగిస్తున్నారని మోటార్లు తొలగించాలని చిట్యాల మండలం జూకల్లు గ్రామానికి చెందిన మాధవరెడ్డి ఫిర్యాదు చేశారు. గోపాల్‌పూర్‌కు చెందిన ఆర్.శ్రీనాథ్ వర్షాకాలంలో వరదకు వెంకటేశ్వరపల్లిలోని 315 సర్వే నెంబర్లలోని మూడు ఎకరాల్లో పంట నష్టం వాటిల్లుతోందని ఫిర్యాదు చేశారు. పంచాయతీ అధికారి సమస్య పరిష్కరించాలని తెలిపారు. ఒప్పంద ప్రాతిపదికన కలెక్టరేట్‌లో సెక్యూరిటీ ఉద్యోగాలు ఉన్నాయని నమ్మించి ఓ వ్యక్తి రూ.లక్ష తీసుకొని 5 నెలలు పని చేసినా జీతం ఇవ్వకుండా వెళ్లగొట్టారని జీతం, చెల్లించిన నగదు ఇప్పించాలని భూపాలపల్లి మండలానికి చెందిన రాజు, పూర్ణచందర్ కోరారు. సోమవారం ప్రజావాణిలో 35 దరఖాస్తులు వచ్చినట్లు వెల్లడించారు.


ప్రజావాణిలో వినతులు స్వీకరిస్తున్న కలెక్టర్ రాహుల్‌శర్మ

సీఎంఆర్ లక్ష్యాలను పూర్తి చేయాలి..

సీఎంఆర్ లక్ష్యాలను వంద శాతం సాధించాలని కలెక్టర్ రాహుల్‌శర్మ మిల్లర్లను ఆదేశించారు. సోమవారం ఐడీఓసీ కార్యాలయంలో సీఎంఆర్, వర్షకాలం ధాన్యం కేటాయింపు, మిల్లుల ట్యాగింగ్, మార్కెట్ కమిటీ లైసెన్స్ తదితర అంశాలపై పౌర సరఫరాలు, మార్కెటింగ్, సహకార శాఖ, రైస్ మిల్లర్లతో సమావేశం నిర్వహించారు. ఇప్పటి వరకు 77.46 శాతం సీఎంఆర్ లక్ష్యం పూర్తి చేశామని, ఈ నెలాఖరులోగా వంద శాతం పూర్తి చేయాలన్నారు. వర్షాకాలం సంబంధించి సీఎంఆర్ ప్రక్రియపై ప్రణాళిక రూపొందించాలని, లక్ష్యాలను సకాలంలో పూర్తి చేస్తేనే ధాన్యం సేకరణ, బియ్యం సరఫరా సక్రమంగా జరుగుతోందని పేర్కొన్నారు. సీఎంఆర్‌లో పాల్గొనే రైస్ మిల్లర్లు నిబంధనలు పాటించాలని, రిజిస్టర్లను నిర్వహించాలని తెలిపారు. ట్యాగ్ చేయని కొనుగోలు కేంద్రాల నుంచి ధాన్యం స్వీకరించొద్దని, సన్న, దొడ్డు రకంలో జాగ్రత్తలు పాటించాలని.. టోకెన్ కేటాయించాలన్నారు. కార్యక్రమంలో ఆర్డీవో మంగీలాల్, పౌర సరఫరాల అధికారి శ్రీనాథ్, డీఎం రాములు, మార్కెటింగ్ డీఎం కనకశేఖర్, సహకార అధికారి వాలియానాయక్ పాల్గొన్నారు.

ఈకేవైసీ నమోదు 87 శాతమే..

న్యూస్‌టుడే, భూపాలపల్లి కలెక్టరేట్

ప్రభుత్వం పేద, మధ్య తరగతి ప్రజలకు తక్కువ ధరకు నిత్యావసర సరకులు అందించేందుకు రేషన్ దుకాణాలను ఏర్పాటు చేసింది. దీంతో పూర్తి రాయితీతో రేషన్ కార్డు ఉన్న ప్రతి ఒక్కరికి 6 కిలోల చొప్పున రేషన్ దుకాణాల ద్వారా బియ్యం పంపిణీ చేస్తున్నారు. బియ్యం పంపిణీ పక్కదారి పట్టకుండా రాష్ట్ర ప్రభుత్వం ప్రత్యేక చర్యలు చేపట్టింది. అందులో భాగంగా జిల్లా వ్యాప్తంగా రేషన్ కార్డు కలిగి ఉన్న ప్రతి ఒక్కరూ ఈకేవైసీ నమోదు కార్యక్రమం ఏడాదిగా జరుగుతోంది. ఇప్పటి వరకు 87 శాతం రేషన్ కార్డుదారులు ఈకేవైసీ నమోదు చేసుకున్నారు. గడువు ముగిసినా నమోదు చేసుకోని వారికి ఇబ్బందులు తప్పవని అధికారులు చెబుతున్నారు.

మండలాల వారీగా ఈకేవైసీ నమోదు శాతం	
మొగుళ్లపల్లి	89
చిట్యాల	88
టేకుమట్ల	89
భూపాలపల్లి	87
గణపురం	86
కాటారం	87
మహదేవపూర్	84
మహాముత్తారం	85
పలిమెల	84
రేగొండ	89
మల్హర్‌రావు	88

● రేషన్ కార్డుదారు ఈకేవైసీ తప్పని సరిగా నమోదు చేసుకోవాలని అధికారులు తెలిపారు. వేలిముద్రలు పడని వృద్ధులు, దివ్యాంగులకు ఐరిష్ ద్వారా నమోదు చేయనున్నారు. కొంతమంది ఆధార్ కార్డు అప్‌డేట్ లేక ఈకేవైసీ నమోదు కావడం లేదు. అలాంటి వారు ఆధార్ కేంద్రానికి వెళ్లి తమ ఆధార్ కార్డు అప్‌డేట్ చేసుకోవాలని అధికారులు చెబుతున్నారు.


భూపాలపల్లిలోని రేషన్ దుకాణంలో ఈకేవైసీ నమోదు చేస్తున్న డీలర్ (పాతచిత్రం)

జిల్లాలో లబ్ధిదారుల సంఖ్య..

జిల్లా వ్యాప్తంగా 277 రేషన్ దుకాణాలు ఉన్నాయి. వాటి ద్వారా ప్రతి నెల రేషన్ కార్డులు ఉన్న ప్రతి ఒక్కరికి 6 కిలోల బియ్యం ఉచితంగా పంపిణీ చేస్తున్నారు. జిల్లాలో 1,23,497 లక్షల కార్డులకు, 3,44,935 మంది లబ్ధిదారులు ఉన్నారు. ఇప్పటి వరకు 87 శాతం మంది ఈకేవైసీ నమోదు చేసుకున్నారు. మిగిలిన 13 శాతం మంది లబ్ధిదారులు తమ వేలిముద్రలు వేయాల్సి ఉంది. ఏడాదికి పైగా ఈకేవైసీ ప్రక్రియ కొనసాగుతున్న వందశాతం పూర్తి కాకపోవడంతో అధికారులు దృష్టి సారించాల్సిన అవసరం ఉంది.

నమోదు చేసుకోవాలి

- శ్రీనాథ్, జిల్లా పౌర సరఫరాల శాఖ అధికారి



రేషన్ కార్డు గల ప్రతి ఒక్కరూ ఈకేవైసీ నమోదు చేసుకోవాలి. రాష్ట్రంలో ఎక్కడైనా రేషన్ దుకాణానికి వెళ్లి లబ్ధిదారులు తమ వేలిముద్రలు లేదా ఐరిష్ ద్వారా ఈకేవైసీ చేసుకునే అవకాశం ఉంది. వేలిముద్రలు పడని వృద్ధులు, చిన్నపిల్లలు ఆధార్ కేంద్రానికి వెళ్లి అప్‌డేట్ చేసుకోవాలి. ఈకేవైసీ గడువు ముగిస్తే రేషన్ సరకులు పొందడం కష్టమవుతోంది.

21న రాష్ట్రస్థాయి ఫొటోగ్రఫీ పోటీలు

భూపాలపల్లి, న్యూస్‌టుడే: పోలీసు అమరవీరుల సంస్మరణ దినోత్సవాన్ని పురస్కరించుకుని జిల్లా పరిధిలో ఔత్సాహిక ఫొటోగ్రఫీ, షార్ట్ ఫిల్మ్‌లకు సంబంధించి రాష్ట్రస్థాయి పోటీలు ఈ నెల 21న తెలంగాణ రాష్ట్ర పోలీసు శాఖ ఆధ్వర్యంలో నిర్వహించనున్నట్లు జిల్లా ఎస్పీ కిరణ్ ఖరే ఒక ప్రకటనలో తెలిపారు. పోటీల్లో విద్యార్థులతో పాటు యువత, ఫొటోగ్రాఫర్లు, షార్ట్ ఫిల్మ్ మేకర్స్ పాల్గొనాలని పేర్కొన్నారు. పోలీసుల త్యాగాలు, విధుల్లో ప్రతిభను తెలిపే విధంగా ఇటీవల కాలంలో తీసిన 3 ఫొటోలు, మూడు నిమిషాల నిడివి కలిగిన షార్ట్ ఫిల్మ్ తీసి ఈ నెల 20 లోపు జిల్లా పోలీసు కార్యాలయంలో అందజేయాలని సూచించారు. మూఢనమ్మకాలు, సామాజిక రుగ్మతలు, అత్యవసర సమయంలో పోలీసుల స్పందన, ప్రకృతి వైపరీత్యాల వేళ పోలీసుల సేవా కార్యక్రమాలను తెలియజేసే విధంగా ఫొటోలు ఉండాలని, సైబర్ నేరాలు, ర్యాగింగ్, మత్తు పదార్థాలతో కలిగే నష్టాల వివరిస్తూ ఈ పోటీలకు నామినేషన్లు పంపించుకోవచ్చని తెలిపారు. వివరాలకు 87126 58164 నెంబర్‌లో సంప్రదించాలని పేర్కొన్నారు.

లిల్లీ తోట.. లాభాల బాట

ఆదర్శం

లింగాలఘనపురం, న్యూస్‌టుడే: జనగామ జిల్లా లింగాలఘనపురం మండలం పటేలు గూడెం గ్రామానికి చెందిన పెండ్లి ప్రభాకర్ పూల తోటల సాగులో ఆదర్శంగా నిలుస్తున్నారు. బీఈడీ పూర్తి చేసినా.. ఉద్యోగం కంటే వృత్తినే నమ్ముకున్నారు. తల్లి దండ్రులు రమేశ్, అనసూయ చేయూతను అందిస్తుండగా 18 ఏళ్లగా మల్లెతోట సాగు చేపట్టారు. ఈ ఏడాది 15 గుంటల విస్తీర్ణంలో బంతిపూల సాగు, 30 గుంటల విస్తీర్ణంలో నేలసంపంగి(లిల్లీ పూలు) సాగు చేశారు. పూలు కోతకు వచ్చి లాభాల బాట పట్టారు. ఈ సందర్భంగా 'రైతే రాజు'తో మాట్లాడారు. గత సంవత్సరం జులైలో నేలను గుల్లగా దుక్కి చేశారు. 4 ట్రాక్టర్ల పశువుల ఎరువు చల్లుకున్నారు. అడుగు దూరం, అడుగు వెడల్పుతో బోదెలు చేసుకున్నారు. వికారాబాద్‌లో రైతు వద్ద నుంచి ఒక్కో బ్యాగ్ రూ.వెయ్యి చెల్లించి 20 బ్యాగుల నేలసంపంగి పూల దుంప(గడ్డ)లను కొనుగోలు చేశారు. వాటిని అడుగు దూరంతో నాటుకున్నారు. నెలకో సారి కంపోస్టు, మిశ్రమ ఎరువులు వేస్తున్నారు. రసం పీల్చే పురుగు నివారణకు పురుగు మందులు పిచికారీ చేస్తున్నారు. ఆరు నెలల్లో పూత ప్రారంభమైంది. ఒక్కసారి నాటితే వరసగా మూడేళ్ల పూలు పూస్తుంటాయి. పూలను ఉదయమే కోయాల్సి ఉంటుంది. హైదరాబాద్ వంటి మార్కెట్‌కు తరలించాలంటే మరింత వేకువజామున పూలు కోస్తున్నారు. వ్రతాలు, పండగలు, పెళ్లిళ్ల సీజన్‌లో కిలో రూ.150 వరకు సాధారణంగా కిలో.రూ.120 వరకు ధర లభిస్తుంది. రోజుకు 20 నుంచి 30 కిలోల దిగుబడి వస్తుంది. 6 నెలల్లోనే పెట్టిన పెట్టుబడులు సాధించారు. రోజుకు రూ.1500 వరకు ఆదాయం లభిస్తుంది. పెట్టుబడులు పోగా ఏటా రూ.5 లక్షల వరకు ఆదాయం ఉంటుంది. ఇద్దరు కూలీలు సరిపోతున్నారు. తక్కువ విస్తీర్ణంలో నేలసంపంగి సాగు చేపట్టి ఎక్కువ లాభాలు పొందుతున్నారు.



నేల సంపంగి పూలు చూపుతున్న పెండ్లి ప్రభాకర్

డ్రోన్.. పిచికారీ అదిరెన్



కాకర్లపల్లిలో డ్రోన్‌తో పురుగు మందు పిచికారీ చేస్తున్న అజయ్‌కుమార్‌గౌడ్

రేగొండ, న్యూస్‌టుడే: ఇటీవల చాలా మంది రైతులు ఆధునిక వ్యవసాయ పద్ధతుల్లో పంటలను సాగు చేస్తున్నారు. నిత్యం మిర్చి, పత్తి వంటి పంటలకు రోజు మార్చి రోజు పురుగు మందులు స్ప్రే చేస్తుంటారు. ఒకటి, రెండు ఎకరాలు పిచికారీ కోసం ఇద్దరు కూలీలు అవసరం ఉంటుంది. రైతుల కష్టాలకు చెక్ పెట్టేలా ఓ ప్రైవేటు కంపెనీ సాయంతో జయశంకర్ భూపాలపల్లి జిల్లా రేగొండ మండలం కాకర్లపల్లి గ్రామానికి చెందిన తాళ్లపల్లి అజయ్ కుమార్‌గౌడ్ డ్రోన్ తీసుకొచ్చారు. తక్కువ ఖర్చు, అతి తక్కువ సమయంలో అన్ని రకాల పంటలపై స్ప్రే చేస్తున్నట్లు చెబుతున్నారు. ఇది పని చేసే విధానాన్ని ఆయన 'రైతేరాజు'కు వివరించారు. సుమారు రూ. 7 లక్షల నుంచి రూ.8 లక్షలతో డ్రోన్ కొనుగోలు చేశారు. బ్యాటరీలను ఒకసారి ఛార్జింగ్ చేస్తే సుమారు 3 ఎకరాల వరకు మందు పిచికారీ చేయవచ్చు. ట్యాంకులో సుమారు 12 లీటర్ల నీటిని, మందును నింపుకునే అవకాశం ఉంటుంది. ఒక్క ఎకరం సుమారు 4 నుంచి 5 నిమిషాల కాలవ్యవధిలో పిచికారీ పూర్తవుతుంది. రోజుకు సుమారు 20 నుంచి 25 ఎకరాలకు మందును స్ప్రే చేయవచ్చు. సాధారణంగా రైతులు ఎకరానికి సుమారు 120 నుంచి 150 లీటర్ల నీటిని ఉపయోగిస్తారు. అదే డ్రోన్‌తో కేవలం 12 లీటర్ల నీరు, తక్కువ మోతాదులో పురుగు మందు కలిపితే చాలు. సాధారణ పద్ధతిలో ఇద్దరు కూలీల ఖర్చులు(రూ.1200 నుంచి రూ.1500), ఒక్క రోజుకు 2 నుంచి 3 ఎకరాలకు తైవాన్ పంపుతో పిచికారీ చేస్తారు. మందు ఎక్కడా నేలపై కాకుండా కేవలం పంట మొక్కలపై పడుతుంది. తక్కువ నీరు, తక్కువ సమయం, తక్కువ మందు, తక్కువ ఖర్చుతో ఎవరికి ఎలాంటి ఇబ్బందులు తలెత్తకుండా పూత, పురుగు మందుల వినియోగం అవుతుందని యువకుడు అజయ్‌కుమార్ గౌడ్ వివరించారు. ప్రస్తుతం ఒక రోజుకు సుమారు రూ.6 వేల నుంచి రూ.8 వేల వరకు ఆదాయం వస్తుందని చెప్పారు.

ప్రశ్న- సమాధానం

? వరిలో అగ్గి తెగులు సోకింది. నివారణ చర్యలు తెలపండి.
– కె.తిరుపతిరెడ్డి, వంగర, భీమదేవరపల్లి

–న్యూస్‌టుడే, వరంగల్ వ్యవసాయం

✔ ట్రైసైక్లోజోల్ 0.6 గ్రాములు లేదా ఐసోప్రోథైయోలిన్ 1.5 మి.లీ లేదా కాసుగామైసిన్ 2.5 మి.లీ లేదా ట్రైసైక్లోజోల్, మ్యాంకోజెబ్ మిశ్రమ మందును 2.5 గ్రాములను లీటరు నీటికి కలిపి పిచికారీ చేయాలి.
– డా.దిలీప్‌కుమార్, కోఆర్డినేటర్, వరంగల్ ఏరువాక కేంద్రం



మిరపలో.. జాగ్రత్తలు పాటిద్దాం..!

ముకోసం

మానుకోట, న్యూస్‌టుడే : ఉమ్మడి వరంగల్ జిల్లాలో పలు ప్రాంతాల్లో మిరప తోటలకు వివిధ రకాల చీడపీడలు ఆశిస్తున్నాయి. ఈ తరుణంలో చేపట్టాల్సిన యాజమాన్య పద్ధతులను మల్యాల కేవీకే కార్యక్రమ సమన్వయకర్త డాక్టర్ మాలతి, ఉద్యాన శాస్త్రవేత్త డాక్టర్ ఈ.రాంబాబు తెలిపారు.

రైతేరాజు

పైముడత: తామర పురుగులు ఆకుల అడుగు భాగంలో రసం పీల్చడంతో ఆకులు పైకి పడవ ఆకారంలో ముడుచుకుంటాయి. నివారణకు ఒక లీటరు నీటికి ఫిప్రోనిల్ రెండు మి.లీ లేదా డయాఫెంథియురాన్ ఒకటిన్నర గ్రాములు లేదా ఎసిఫేట్ ఒకటిన్నర గ్రాములు కలిపి పిచికారీ చేయాలి.

వేరుకుళ్లు: మొక్కల వేర్లు నల్లబారి మొక్కలు చనిపోతాయి. మొదళ్లలో కాపర్ ఆక్సీక్లోరైడ్ 30గ్రాములు+ప్లాంటోమైసిన్ ఒక గ్రాము 10 లీటర్ల నీటికి లేదా లీటరు నీటికి కాపర్ హైడ్రాక్సైడ్ రెండు గ్రాములు లేదా మెటలాక్సిల్ రెండున్నర గ్రాములు కలిపి వారం రోజుల వ్యవధిలో రెండు నుంచి మూడుసార్లు మొక్కల వేర్లు బాగా తడిసేలా పోసుకోవాలి. ట్రైకోడెర్మా విరిడి రెండు కిలోలు+ 90 కిలోలు బాగా చితికిన పశువుల ఎరువుతో కలిపి వారం పది రోజుల పాటు బాగా మగ్గిన తర్వాత తెల్లని బూజు ఏర్పడుతుంది. ఆ మిశ్రమాన్ని మొక్కల మొదళ్లలో వేసుకోవాలి.

● **ఆకుముడత :** ఇది ఆశించిన మొక్కల ఆకులు కుచించుకుపోయి గిడసబారి మొక్క ఎదుగుదల క్షీణిస్తుంది. తెల్లదోమ ద్వారా వ్యాప్తి చెందుతుంది. జిగురు అట్టలు ఎకరాకు 30 నుంచి 40 వేసుకోవాలి. వేపనూనె (1500 పీపీఎం) ఐదు మి.లీ లీటరు నీటికి కలిపి పిచికారీ చేసుకోవాలి. తెల్లదోమల నివారణకు లీటరు నీటికి ఎసిఫేట్ ఒకటిన్నర గ్రాములు లేదా థయోమిథాక్సాం 0.3 గ్రాములు లేదా ఇమిడాక్లొప్రిడ్ 0.3 మి.లీ లేదా క్లోరోఫిన్‌ఫైర్ రెండు మి.లీ వంటి మందులను మారుస్తూ పిచికారీ చేయాలి.

● **నల్లతామర :** ఆకుల చిగుర్లు ఎరుపు వర్ణంలోకి మారి మాడిపోయినట్లు కనిపిస్తాయి. నివారణకు జిగురు అట్టలు ఎకరాకు 20 నుంచి 30 ఏర్పాటు చేయాలి. ఫిప్రోనిల్ 80 శాతం 40 గ్రాములు ఎకరాకు లేదా ఫిప్రోనిల్+ ఇమిడాక్లొప్రిడ్ 40 గ్రాములు ఎకరాకు, లేదా సయాంట్రనిలిప్రోల్ 90-100 మి.లీ ఎకరాకు లేదా స్పైనటోరమ్ 180 మి.లీ ఎకరాకు 200 లీటర్ల నీటిలో కలిపి పిచికారీ చేయాలి.



నల్లతామర పురుగులు

ఆశయం ఘనం.. ఆచరణలో విఫలం!

జనగామ, న్యూస్‌టుడే: పర్యావరణానికి మేలు చేయడంతో పాటు, పట్టణ పేద మహిళలకు ఉపాధి మార్గం చూపించే ఆశయంతో ప్రారంభించిన ఓ పథకం మూలకు చేరింది. పట్టణ మహిళల ఆర్థిక ప్రగతికి మెప్మా ఆధ్వర్యంలో వారి సొంత, కొత్త వ్యాపారాలకు రుణాలిస్తున్నారు. ఇటు ఆదాయం, అటు పర్యావరణానికి హితంగా ఉండేలా ప్రారంభించిన 'స్టీల్ బ్యాంకు' పథకం ఉమ్మడి జిల్లాలో ఆచరణలో విఫలమైంది. పట్టణ ప్రాంతాలకు సమస్యగా మారిన ప్లాస్టిక్ వాడకాన్ని తగ్గించేందుకు నిషేధాజ్ఞలు విధించి జరిమానాలు వడ్డిస్తున్నారు. విందులు, ప్రత్యేక సందర్భాల్లో ప్లాస్టిక్ ప్లేట్లు, గ్లాసుల వాడకం ద్వారా ఒకసారి వాడి పడేసే ప్లాస్టిక్ వ్యర్థాలు అధికంగా పోగవుతున్నాయి. ఈ సమస్యను పరిష్కరించడానికి పట్టణ పేదరిక నిర్మూలన సంస్థ(మెప్మా) ఆధ్వర్యంలో ఉభయతారకంగా ఉండేలా 'స్టీల్‌బ్యాంకు' పథకాన్ని ప్రవేశపెట్టారు. ప్లాస్టిక్ వస్తువుల స్థానంలోనే గతంలో మాదిరిగా స్టీలు, ఇండాలియం(అల్యూమినియం) గిన్నెలు, కంచాలు, గ్లాసుల వినియోగాన్ని ప్రోత్సహించేందుకు దీనిని ప్రారంభించారు. ఈ పథకం ద్వారా ఒక వేడుకలో 8 కిలోల ప్లాస్టిక్ వాడకం తగ్గుతుందని పరిగనలోకి రావడంతో కేంద్ర, రాష్ట్ర ఆర్థిక సర్వే సంస్థల నుంచి ప్రశంసలు సైతం దక్కాయి.

మూతపడిన స్టీల్ బ్యాంకు పథకం

ఇలా ప్రారంభమైంది..

మహాత్మా గాంధీ జాతీయ నిధి(ఎంజీఎన్ఎఫ్) ఆధ్వర్యంలో రాష్ట్రంలో పురపాలికలున్న జిల్లా కేంద్రాల్లో స్టీలు సామగ్రి(స్టీల్ బర్తన్) బ్యాంకులను ఏర్పాటు చేశారు. మొదటి దశలో రూ.1.50 లక్షల నుంచి రూ.1.75 లక్షల వరకు పెట్టుబడిని రుణ రూపేణ సమకూర్చారు.. ఇందులో భాగంగా గత సంవత్సరం జనగామ, మహబూబాబాద్ జిల్లా కేంద్రాల్లోని పురపాలికల్లో ఒక్కొక్కటి, వరంగల్, హనుమకొండ జిల్లాల పరిధిలో మూడు బ్యాంకులను ప్రారంభించారు. నిర్వహణకు ఆసక్తి కలిగిన మహిళా సంఘాలను ఎంపిక చేసి, తక్కువ వడ్డీకి రుణం మంజూరు చేశారు. వసతి సౌకర్యం కల్పించి, కేంద్రం ద్వారా అద్దె ప్రాతిపదికన పాత్రలను స్టీల్ బ్యాంకు ద్వారా అందజేసేలా కార్యాచరణ రూపొందించారు. దశలవారీగా టెంట్లు, కుర్చీలు, బల్లలు ఇతర సామగ్రిని సమకూర్చుకుని వ్యాపారాన్ని వృద్ధి చేసుకోవచ్చునని సూచించారు.

సహకారం కొరవడి.. రుణం భారమై..

జనగామ పరిధిలో మహమ్మద్ స్లమ్‌లెవల్ ఫెడరేషన్ ఆధ్వర్యంలో నర్మద, రజియాలు 17 రకాల వస్తువులతో స్టీల్ బ్యాంకును సెప్టెంబరు 2023లో ప్రారంభించారు. మున్సిపాలిటీ, ఇతర ప్రభుత్వ శాఖల నుంచి, మెప్మా సంఘాల నుంచి సహకారం అందలేదు. రవాణా, కూలీలకు చెల్లింపులు భారమయ్యాయి. దీంతో ఒకటి రెండు వేడుకలకు మినహా స్టీల్ సామగ్రిని సరఫరా చేయలేకపోయారు. రుణ భారం మీదపడింది. జయశంకర్ భూపాలపల్లిలో కేంద్రాన్ని ప్రారంభించలేదు. మహబూబాబాద్‌లో కొన్నాళ్లపాటు నడిచినా ప్రస్తుతం మనుగడలో లేదు. వరంగల్ కార్పొరేషన్ పరిధిలో కాజీపేట బ్యాంకు సామగ్రిని క్యాంటీన్ నిర్వహణలో వాడుతున్నారు. మరో రెండు చోట్ల ఖాయిలా పడ్డాయి.



జనగామలో ఇలా..

☛ పట్టణ సమాఖ్య నుంచి, రూ.1.50 లక్షలు రుణం తీసుకుని కేంద్రాన్ని ఏర్పాటు చేశాము. ఆశించిన సహకారం లేదు. దీంతో నిర్వహణ భారమైంది. ఆదాయం లేకున్నా, నెలనెలా వడ్డీతో పాటు కిస్తీ చెల్లించాల్సి వస్తోంది. రుణం రద్దు చేసి ఆదుకోవాలని జనగామ స్టీల్‌బ్యాంకు నిర్వాహకురాలు నర్మద తెలిపారు.

☛ ఆశించిన మేర సులభతర సేవలకు అవకాశం లేకపోవడం ఇబ్బందిగా మారింది. ఇతర జిల్లాల్లో మాదిరి ఇక్కడా నిరుపయోగంగా ఉన్న స్టీల్ బ్యాంకు సామగ్రిని మహిళా శక్తి క్యాంటీన్‌కు సరఫరా చేసే అవకాశాన్ని కల్పించాలని జిల్లా ఉన్నతాధికారుల దృష్టికి తీసుకువెళ్తామని జనగామ మెప్మా పీడీ హర్షవర్ధన్ వివరించారు.

విదేశానికి వెళ్లే భాగ్యం లేదా?

అంతర్జాతీయ క్రీడా పోటీలకు ఎంపికైన దివ్యాంగురాలు

మహబూబాబాద్, న్యూస్‌టుడే: పుట్టుకతో ఒంటి కాలుతో వచ్చిన వైకల్యంతో ఆమె కుంగిపోలేదు.. ఇరుగుపొరుగువారి సూటిపోటి మాటలే ఆమెలో పట్టుదలను పెంచాయి.. ఏదైనా సాధించాలనే తపన పెంచాయి. అమ్మమ్మ ఇంటివద్ద ఉంటూ చదువుకొంది.. ఏడో తరగతిలో ఉన్నప్పుడు పాఠశాలలో ప్రపంచ దివ్యాంగుల దినోత్సవాన్ని నిర్వహించారు. అప్పుడే ఆమె దృష్టి క్రీడల వైపు మళ్లించి ప్రతిభ చాటుతోంది. అంతర్జాతీయ పారా త్రోబాల్ పోటీలకు దివ్యాంగుల విభాగంలో ఎంపికై దాతల ఆర్థిక సహకారం ఎదురుచూస్తోంది.



డి. భాగ్య

మహబూబాబాద్ జిల్లా గూడూరు మండలం గొల్లగూడెనికి చెందిన దయ్యాల కొమరమ్మ-కొమరయ్యల కూతురు భాగ్య తన కున్న వైకల్యాన్ని లెక్కచేయకుండా ట్రైసైక్లింగ్, షార్ట్‌పుట్, చెస్, క్యారమ్స్ పోటీల్లో పాల్గొంటోంది. సీనియర్ క్రీడాకారుడు ప్రశాంత్ అందించిన సహకారంతో దివ్యాంగుల విభాగంలో వివిధ క్రీడల్లో పాల్గొని రాష్ట్రస్థాయిలో రాణిస్తోంది. ఈ ఏడాది డిసెంబర్ 1 నుంచి 5 వ తేదీ వరకు ఇండోనేషియాలో నిర్వహించనున్న అంతర్జాతీయ 'పారా త్రోబాల్ పోటీల్లో పాల్గొనేందుకు దివ్యాంగుల విభాగంలో ఎంపికైంది. పారా త్రోబాల్ ఫెడరేషన్ ఆఫ్ ఇండియా(ఆర్) ఆధ్వర్యంలో సెప్టెంబర్ 21 నుంచి 24 వరకు ఝార్ఖండ్ రాష్ట్రంలో నిర్వహించిన జాతీయ పోటీల్లో పాల్గొని అంతర్జాతీయ పోటీలకు ఎంపికైన క్రీడాకారుల్లో తెలంగాణ రాష్ట్రం నుంచి ఆమెకు అవకాశం లభించింది. విదేశాలకు వెళ్లేందుకు అయ్యే సుమారు రూ. 90 వేలు వ్యయం భరించే ఆర్థిక స్థోమత లేక ఆవేదన చెందుతోంది. 2019లో కూడా ఆమె థాయిలాండ్‌లో నిర్వహించిన అంతర్జాతీయ పారా ఒలింపిక్ పోటీలకు ఆర్థిక స్థోమత లేక వెళ్లలేకపోయింది. మరోసారి అవకాశం వచ్చినా ఆమెకు లక్ష్మీ కటాక్షం కరవైంది. ఈసారి ఎలాగైన ఇండినేషియాలో నిర్వహించే పోటీల్లో పాల్గొనాలనే ఆశతో తనకు ఆర్థిక సహకారం అందించాలంటూ సోమవారం కలెక్టరేట్‌లో విన్నవించారు. జిల్లా క్రీడలు, యువజన శాఖలో బడ్జెట్ లేకపోవడంతో తాము ఆర్థికంగా చేయూతను అందించలేమని, ప్రభుత్వానికి ప్రతిపాదనలు పంపిస్తామని అధికారులు బదులిచ్చారు. మొదటి విడతగా రూ. 35 వేలు మంగళవారం వరకు, మిగిలిన సొమ్ము నవంబర్ నెల 15 వరకు సమకూరుతేనే వీసా, వసతి సౌకర్యాలు కలుగుతాయని చెబుతూ దాతల సహకారాన్ని ఆశిస్తోంది.

16, 17న క్రికెట్ ఎంపిక పోటీలు

వరంగల్ క్రీడావిభాగం, న్యూస్‌టుడే: వరంగల్ క్రికెట్ సంఘం ఆధ్వర్యంలో అండర్-23 విభాగంలో ఈ నెల 16, 17 తేదీల్లో ఎంపిక పోటీలు నిర్వహించనున్నట్లు ఆ సంఘం కార్యదర్శి శ్రీనివాస్ తెలిపారు. వరంగల్ మండిబజార్‌లో జరిగిన సమావేశంలో వివరాలు వెల్లడించారు. దేశాయిపేట సీకేఎం కళాశాల మైదానంలో పోటీలు ఉంటాయన్నారు. వరంగల్, హనుమకొండ, ములుగు, భూపాలపల్లి, జనగామ, మహబూబాబాద్ జిల్లా జట్లకు ఎంపిక పోటీలు నిర్వహిస్తామన్నారు. ఆరు జిల్లాల క్రికెటర్ల ప్రతిభ ఆధారంగా ఉమ్మడి జిల్లా జట్టు ఎంపిక చేస్తామన్నారు. ఎంపికైన జట్టు ఈ నెల 20 నుంచి 23వరకు వరంగల్ నగరంలో జరిగే ఇంట్రా డిస్ట్రిక్(ఉమ్మడి జిల్లాలు) క్రికెట్ టోర్నీలో పాల్గొంటారని వివరించారు.

చికెన్ ధరలు (కిలో వెల రూపాయలలో) వెన్‌కాబ్		
	ఫాం: 126	డ్రెస్డ్: 215
	రిటైల్: 148	స్కిన్‌లెస్: 244

నేటి నుంచి వరల్డ్ హెరిటేజ్ వాలంటీర్ శిబిరం



రామప్ప ఆలయం

వెంకటాపూర్(ములుగు జిల్లా), న్యూస్‌టుడే: యునెస్కో గుర్తింపు పొందిన రామప్ప ఖ్యాతిని ప్రపంచ నలుమూలలా చాటిచెప్పేందుకు ఏటా నిర్వహించే వరల్డ్ హెరిటేజ్ వాలంటీర్ శిక్షణ శిబిరం-3 మంగళవారం నుంచి ప్రారంభం కానుంది. యునెస్కో, కేంద్రపురావస్తు, పర్యాటక శాఖలు, ఇంటాక్ భాగస్వామ్యంతో ఈనెల 15 నుంచి 26 వరకు 80 మంది వాలంటీర్లకు శిక్షణ ఇచ్చేందుకు శ్రీకారం చుట్టారు. గుర్తింపు తర్వాత నిర్వహించే మూడో శిబిరంలో రాష్ట్రంలోని టూరిజం క్లబ్‌లకు కూడా ఈ ఏడాది కొత్తగా అవకాశం కల్పించారు. ఏటా డబ్ల్యూహెచ్‌వీ(వరల్డ్ హెరిటేజ్ వాలంటీర్ శిబిరం) నుంచి ఎంపికైన వారికి మాత్రమే తర్ఫీదు ఇచ్చేది. దాంతో ప్రపంచస్థాయిలోనే కాకుండా స్థానికంగా కూడా రామప్ప కీర్తిని మరింత చాటేందుకు అడుగులు పడ్డాయి. కాకతీయ హెరిటేజ్ ట్రస్టు ఆధ్వర్యంలో ఏర్పాట్లను సోమవారం పరిశీలించారు. జిల్లా పాలనాధికారి చేతుల మీదుగా కార్యక్రమాన్ని ప్రారంభించేందుకు సన్నాహాలు చేస్తున్నారు. 12 రోజుల పాటు వివిధ శాఖల్లో ప్రావీణ్యం కలిగిన ప్రొఫెసర్లతో శిక్షణ ఇచ్చేందుకు ప్రణాళికలు రూపొందించారు.

మే నుంచే దరఖాస్తుల స్వీకరణ : ఈ శిబిరం నిర్వహణకు యునెస్కో మే 2024లోనే ఆన్‌లైన్‌లో దరఖాస్తుల స్వీకరణకు ప్రకటన వెల్లడించింది. ప్రపంచ వ్యాప్తంగా స్వదేశీయులతో కలిపి 253 మంది www.unesco.whc.org వెబ్‌సైట్‌లో దరఖాస్తు చేసుకున్నారు. వీరిలో 45 మంది విదేశీయులు ఎంపికయ్యారు. కొన్ని కారణాలతో ఈసారి విదేశీయులెవ్వరూ శిబిరానికి హాజరుకావడం లేదని, ప్రస్తుతం మన దేశంలోని కేరళ, తమిళనాడు, మహారాష్ట్ర, గుజరాత్, కర్ణాటక, ఆంధ్రప్రదేశ్, తెలంగాణ నుంచి 40 మందిని ఎంపిక చేసినట్లు ఇంటాక్ ప్రతినిధి శ్రీధర్‌రావు 'న్యూస్‌టుడే'కు తెలిపారు. వీరిలో 18 నుంచి 35 ఏళ్లలోపున్న చరిత్ర, కళలు, పురావస్తు, ఆర్కిటెక్చర్, సివిల్ ఇంజినీరు, టూరిజం విభాగాల్లో నైపుణ్యం కలిగిన విద్యార్థులున్నారు.

యువ టూరిజం నుంచి 40 మంది : రాష్ట్రంలోని పర్యాటక ప్రాంతాల ప్రాశస్త్యాన్ని మరింత బలోపేతం చేయడానికి రాష్ట్ర వ్యాప్తంగా చేపట్టిన టూరిజం క్లబ్‌ల నుంచి రామప్పలో నిర్వహించే ఈ శిబిరానికి ప్రత్యేకంగా యువటూరిజం(ఉమ్మడి వరంగల్ జిల్లా నుంచి) 40 మందిని ఎంపిక చేసింది. రామప్ప ఖ్యాతిని తెలుసుకునేలా రాష్ట్రం నుంచి కూడా చోటు కల్పించాలని యునెస్కోను కోరడంతో స్థానికులకు అవకాశమిచ్చినట్లు పర్యాటకశాఖ అధికారులు పేర్కొన్నారు. రాష్ట్రంలోని వివిధ యూనివర్సిటీల్లో పర్యాటకం, చరిత్ర విద్యనభ్యసిస్తున్న వారే అధికంగా ఉండటం గమనార్హం.

కిక్కిరిసిన బస్సులు..!

హనుమకొండ చౌరస్తా, న్యూస్‌టుడే: బతుకమ్మ, దసరా వేడుకలు ముగిశాక సొంతూళ్ల నుంచి వారి గమ్యస్థానాలకు బయలుదేరడంతో హనుమకొండ బస్టాండు సోమవారం ప్రయాణికులతో కిటకిటలాడింది. ప్రయాణికులు బస్సుల్లో కిక్కిరిసి ప్రయాణించారు. ఉమ్మడి జిల్లా వ్యాప్తంగా 850 ప్రత్యేక బస్సులను నడిపించినా.. ఆది, సోమవారాల్లో ప్రయాణ ప్రాంగణాలు నిండిపోయాయి. హైదరాబాద్ వెళ్లే వారి సంఖ్య భారీగా ఉంది. రద్దీని గమనించిన ఆర్టీసీ అధికారులు బస్టాండులోనే ఉంటూ పర్యవేక్షిస్తూ ప్రత్యేక బస్సులను నడిపించారు. సోమవారం రాత్రి వరకు రద్దీ కొనసాగింది. హైదరాబాద్, బెంగళూరు, విశాఖపట్టణం, గుంటూరు, విజయవాడ, మచిలీపట్టణం, నిజామాబాద్, కరీంనగర్ తదితర ప్రాంతాలకు ఎక్కువగా నడిశాయి. ఉమ్మడి జిల్లాకు హనుమకొండ బస్టాండు ప్రధాన కేంద్రం కావడంతో ఇక్కడే ప్రయాణికుల రద్దీ ఎక్కువగా కనిపించింది. ఆర్టీసీ డీఆర్ఎం భానుకిరణ్, వరంగల్ 1, వరంగల్ 2 డిపోల మేనేజర్లు మోహన్‌రావు, జ్యోత్స్న తదితరులు ఎప్పటికప్పుడు పర్యవేక్షిస్తూ.. తగిన విధంగా సేవలందించారు. బస్సులన్నీ రద్దీ మార్గాలకు పంపించడంతో జిల్లాలో రోజువారీ నడిచే బస్సులు లేక ప్రయాణికులు ఇబ్బంది పడ్డారు.



బస్సు ఎక్కేందుకు పోటీ పడుతూ..



హనుమకొండ బస్టాండులో ప్రయాణికుల రద్దీ

తెరుచుకోని ప్రైవేటు డిగ్రీ, పీజీ కళాశాలలు



నిరసన వ్యక్తం చేస్తున్న ప్రైవేటు కళాశాలల అసోసియేషన్ బాధ్యులు

విద్యానగర్, న్యూస్‌టుడే: బోధన రుసుం విడుదల కోరుతూ ప్రైవేటు డిగ్రీ, పీజీ కళాశాలల యాజమాన్యాలు సోమవారం బంద్ పాటించాయి. దీంతో కాకతీయ విశ్వవిద్యాలయం పరిధిలోని సుమారు 180 ప్రైవేటు కళాశాలలు మూతపడ్డాయి. దసరా సెలవుల తరువాత నిరవధికంగా బంద్ పాటిస్తామని ఇటీవల కేయూ రిజిస్ట్రార్‌కు వినతిపత్రం సమర్పించారు. సోమవారం కళాశాలల బంద్ చేస్తూ హనుమకొండ వాగ్దేవి డిగ్రీ, కళాశాల ముందు నిరసన ప్రదర్శన నిర్వహించారు. కళాశాలలను బంద్ చేస్తే కఠిన చర్యలు తీసుకుంటామని ఆదివారం కేయూ రిజిస్ట్రార్ ఆచార్య పి.మల్లారెడ్డి హెచ్చరించినా, యాజమాన్యాలు పట్టించుకోలేదు. కళాశాలల అసోసియేషన్ అధ్యక్షుడు పి.ఉపేందర్‌రెడ్డి మాట్లాడుతూ సుమారు రూ.300 కోట్లు బోధన రుసుం బకాయిలు రాక నిర్వహణ భారమైనందునే విధిలేక మూసివేత నిర్ణయం తీసుకున్నట్లు తెలిపారు. వెంటనే బోధన రుసుం బకాయిలు చెల్లించి విద్యార్థులకు, కళాశాలల యాజమాన్యాలకు న్యాయం చేయాలని కోరారు. కార్యక్రమంలో ప్రైవేటు కళాశాలల అసోసియేషన్ బాధ్యులు ప్రభాకర్ రెడ్డి, వేణుమాధవ్, తదితరులు పాల్గొన్నారు.

పాఠశాలల్లో తేలని విద్యార్థుల లెక్క

భూపాలపల్లి, న్యూస్‌టుడే: కేంద్ర ప్రభుత్వం ఒకటి నుంచి ఇంటర్మీడియట్ వరకు విద్యార్థుల సంఖ్య కోసం 2012-13లో యూడైస్ పోర్టల్ (ఏకీకృత జిల్లా విద్యా సమాచారం) ప్రవేశపెట్టింది. దీనిని రెండేళ్ల కిందట యూడైస్ ప్లస్‌గా మార్చారు. అయితే ప్రభుత్వ, ప్రైవేటు పాఠశాలల్లో విద్యార్థుల సంఖ్య తేల్చ లేక విద్యాశాఖ అధికారులు తల పట్టుకుంటున్నారు. ఈ విద్యా సంవత్సరం ప్రవేశాల గడువు ముగిసినా ఇంత వరకు తుది జాబితా కొలిక్కిరాలేదు. అయితే పిల్లలు రోజూ పాఠశాలలకు వస్తున్నారా.. వేరే గ్రామాలు, పట్టణాలకు వలస వెళ్లారా.. తదితర ప్రశ్నలకు సమాధానం దొరకడం లేదు. రెండేళ్ల క్రితం నుంచి యూడైస్ ప్లస్ ద్వారా విద్యార్థుల సమగ్ర సమాచారం పొందుపరుస్తున్నారు. ఉమ్మడి వరంగల్ జిల్లాలో ఇప్పటి వరకు 50,463 మంది విద్యార్థుల సమాచారం లేదు.

మౌలిక వసతుల కల్పనకు..

బడి ఈడు పిల్లలు చదువుతున్నారా లేక బడి బయట ఉన్నారా.. తదితర విషయాలను యూడైస్ ప్లస్ నివేదిక తెలియజేస్తుంది. ప్రభుత్వ పాఠశాలల్లో మౌలిక వసతుల కల్పనకు ఈ నివేదిక కొలమానం కానుంది. అదే విధంగా ప్రవేశం పొందిన విద్యార్థులకు సంబంధించిన ఆధార్ నంబరు అనుసంధానిస్తున్నారు. దీంతో ఒక విద్యార్థి పేరు రెండు చోట్ల ఉండే అవకాశం లేదు. వివరాలు నమోదు చేయడంలో ప్రభుత్వ, ప్రైవేటు యాజమాన్యాలు నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్నాయి. పోర్టల్‌లో నమోదు కాని విద్యార్థుల వివరాలపై ఉన్నతాధికారులు ఆదేశించినా ఫలితం లేదు.

సాంకేతిక సమస్య కారణం..

పాఠశాలల్లో బోగస్ సంఖ్య తప్పించుకునేందుకు కొత్త ఎత్తుగడ వేస్తున్నారు. కొందరికి ఆధార్ కార్డు పొందడం కోసం వేలిముద్రలు పడటం లేదని, మరికొందరు ఉపాధి కోసం వలస వెళ్లి మళ్లీ ఇక్కడే చదువుతున్నారని, ఆధార్ నవీకరణలో సాంకేతిక సమస్యలు ఉన్నాయని, ఇలా వివిధ కారణాలు చెబుతున్నారు. కొన్ని చోట్ల నెలల తరబడి పిల్లలు హాజరు కాకున్నా వారి రిజిస్టర్‌లో నమోదు చేస్తున్నారు. పిల్లల సంఖ్య తగ్గితే అక్కడ నుంచి బదిలీ లేదా డిప్యుటేషన్‌పై వేరే ప్రాంతానికి పంపిస్తారనే ఆరోపణలు సైతం వ్యక్తమవుతున్నాయి. విద్యాశాఖ అధికారులు దృష్టి సారిస్తే బోగస్ సంఖ్య తేలనుంది. పాఠశాలల్లో చేరిన ప్రతి విద్యార్థికి శాశ్వత విద్యా సంఖ్య (పర్మినెంట్ ఎడ్యుకేషన్ నెంబర్) కేటాయించి పోర్టల్‌లో నమోదు చేస్తారు. శాశ్వత సంఖ్య ఆధారంగా ప్రవేశం కల్పిస్తే ఎక్కడ చదువుతున్నారో తెలుస్తుంది.



తరగతి గదిలో విద్యార్థులు

ప్రధానోపాధ్యాయులను ఆదేశించాం

- రాజగోపాల్, విద్యాశాఖ జిల్లా ప్లానింగ్ కో ఆర్డినేటర్

ప్రతి విద్యార్థి పేరుతో పోర్టల్‌లో నమోదు చేస్తున్నాం. జిల్లాలో డ్రాప్ బాక్స్‌లో ఉన్న వివరాలను తొలగించేందుకు ప్రత్యేక కార్యాచరణ చేపట్టాం. తమ పరిధిలోని సంఖ్య తేల్చాలని ఇప్పటికే అన్ని పాఠశాలల హెచ్ఎంలను ఆదేశిస్తున్నాం. నిర్లక్ష్యం చేస్తే చట్టప్రకారం చర్యలు తీసుకోవాలని రాష్ట్ర విద్యాశాఖ ఉత్తర్వులు జారీ చేశారు. ముఖ్యంగా ప్రధానోపాధ్యాయులు స్పందించి లెక్కలు తేల్చాలి.

విదేశాల్లో ఉద్యోగాలకు నమోదు చేసుకోండి

కొత్తవాడ, న్యూస్‌టుడే: విదేశాల్లో ఉద్యోగాల కోసం నమోదు(ఎన్‌రోల్‌మెంట్) ప్రక్రియ చేపడుతున్నట్లు వరంగల్ జిల్లా ఉపాధి కల్పన అధికారి ఉమారాణి తెలిపారు. తెలంగాణ ఓవర్సీస్ మ్యాన్‌పవర్ కంపెనీ లిమిటెడ్(టామ్‌కామ్), రాష్ట్ర కార్మిక, ఉపాధి శిక్షణ, కర్మాగారాల శాఖ సహకారంతో జర్మనీలో వివిధ ఉద్యోగావకాశాలు ఉన్నాయన్నారు. ఈ నెల 17న ములుగురోడ్డులోని ప్రభుత్వ ఐటీఐ కళాశాలలో నమోదు కార్యక్రమం ఉంటుందన్నారు. పూర్తి వివరాలకు 94400 52592 సంప్రదించాలన్నారు.

ఉమ్మడి వరంగల్ జిల్లా వ్యాప్తంగా సేకరించాల్సిన పిల్లల సంఖ్య

భూపాలపల్లి	ములుగు	వరంగల్
4,009	3,228	12,547
జనగామ	హనుమకొండ	మహబూబాబాద్
6,368	15,415	9,028

రూ.10 నాణెం చెల్లుబాటు

కాజీపేట : రిజర్వ్ బ్యాంకు ఉత్తర్వుల ప్రకారం రూ.10 నాణెం చెల్లుబాటు అవుతుందని కెనరా బ్యాంకు ఒక ప్రకటనలో తెలిపింది. నాణెం చెల్లుబాటుపై విస్తృత ప్రచారం జరగాలని సూచించింది. నాణేల స్వీకరణలో విముఖత చూపిస్తున్న వారి అనుమానాలను నివృత్తి చేసి వినియోగంలోకి తెచ్చేలా చూడాలని పేర్కొంది.

మేడారం దారిలో.. జరభద్రం



కేశవాపూర్ సమీపంలో..



కొర్లకుంట అలుగు వద్ద..

కాటారం-మేడారం ప్రధాన రహదారి ప్రమాదకరంగా మారింది. మేడారం జాతర సమయంలో చేపట్టిన మరమ్మతు పనులలో నాణ్యత లేకపోవడంతో వర్షాలకు రోడ్డు కుంగిపోయింది. మహాముత్తారం మండలంలోని కొర్లకుంట అలుగు ఒర్రె సమీపంలో, యామన్‌పల్లి సుందరమ్మ చెరువు కట్టపై, కేశవాపూర్ పెద్దవాగు సమీపంలో భారీ గుంతలు ఏర్పడ్డాయి. ఈ రహదారిపై నిత్యం రాకపోకలు సాగిస్తున్నారు. నిత్యం ప్రమాదాలు చోటుచేసుకుంటున్నాయి. అధికారులు స్పందించి మరమ్మతు చేయాలని వాహనదారులు కోరుతున్నారు. – న్యూస్‌టుడే, మహాముత్తారం(భూపాలపల్లి జిల్లా)

సాయిబాబా మరణం తీరని లోటు



సాయిబాబా చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పిస్తున్న నాయకులు

భూపాలపల్లి, న్యూస్‌టుడే: ప్రొ. సాయిబాబా మరణం సమాజానికి తీరని లోటని సీపీఐ పట్టణ కమిటీ కార్యదర్శి సోత్కు ప్రవీణ్‌కుమార్ తెలిపారు. భూపాలపల్లి పట్టణంలోని భగత్‌సింగ్ కాలనీలో సోమవారం సాయిబాబా చిత్రపటానికి పూలమాల వేసి నాయకులు నివాళులర్పించారు. ఈ సందర్భంగా ప్రవీణ్‌కుమార్ మాట్లాడుతూ.. సాయిబాబా గిరిజనులు, దళితులు, విద్యార్థులు, రైతులు, కార్మికుల పక్షాన అనేక పోరాటాలు చేసిన గొప్ప వ్యక్తి అని కొనియాడారు. కార్యక్రమంలో నాయకులు రవి, రాంచందర్, భాస్కర్, రమేష్, రాజు, రాజయ్య తదితరులు పాల్గొన్నారు. సీపీఐ (ఎంఎల్) లిబరేషన్ జిల్లా కార్యదర్శి మారపెల్లి మల్లేష్, పట్టణ కమిటీ కార్యదర్శి చంద్రగిరి శంకర్ జిల్లా కేంద్రంలో సాయిబాబా చిత్రపటానికి పూలమాల వేసి నివాళి అర్పించారు. జీవిత కాలం ప్రజా హక్కుల గొంతుకగా పౌరహక్కుల నాయకుడిగా ప్రజా సమస్యల పరిష్కారం కోసం అనేక ఉద్యమాలు చేపట్టిన గొప్పవ్యక్తి అని నాయకులు కొనియాడారు. కార్యక్రమంలో నాయకులు నరేష్, రాకేష్, రవి తదితరులు పాల్గొన్నారు.

మేమున్నాం.. మీకు తోడుగా

టేకుమట్ల: 96032 95502, భూపాలపల్లి: 94408 47097, భూపాలపల్లి రూరల్: 99592 57553 (10 AM TO 1 PM)

మహాముత్తారం, న్యూస్‌టుడే: పెగడపల్లి నుంచి కనుకునూర్ అటవీ మార్గంలో చెట్ల పొదలు రహదారిని పూర్తిగా కమ్మేశాయి. రోడ్డుపై భారీ గుంతలు పడి ప్రమాదకరంగా మారింది. **- బొడిగె రమేష్, కనుకునూర్**

సమాధానం: సమస్యను పరిశీలించి త్వరలో పరిష్కరిస్తాం. **- అవినాష్, రోడ్లు, భవనాలు శాఖ ఏఈ**

ఆలయ పరిసరాల్లో బ్లీచింగ్

స్పందనకు వందనం

రేగొండ: మండలంలోని కొడవటంచ లోని సుప్రసిద్ధ శ్రీ లక్ష్మీనరసింహస్వామి ఆలయ పరిసరాల్లో సిబ్బంది సోమవారం బ్లీచింగ్ పొడి చల్లారు. దసరా పండగను పురస్కరించుకుని ఆలయ పరిసరాలల్లో భక్తులు కోళ్లు, గొర్రెలు, మేకలు బలి ఇచ్చారు. దీంతో దుర్వాసన వస్తోందని ఆలయ అధికారులకు ఫిర్యాదు చేసినా పట్టించుకోవడం లేదని భక్తులు 'న్యూస్‌టుడే' దృష్టికి తీసుకొచ్చారు. విషయాన్ని ఆలయ సిబ్బంది శ్రావణ్‌కుమార్‌కు వివరించగా ఆయన వెంటనే స్పందించారు. ఆలయ సిబ్బందితో బ్లీచింగ్ పౌడర్ చల్లించారు.

మేడిపల్లిలో ఉచిత వైద్య శిబిరం



కాటారం, న్యూస్‌టుడే: మేడిపల్లి గ్రామంలో ప్రాథమిక ఆరోగ్య కేంద్రం ఆధ్వర్యంలో సోమవారం ఉచిత వైద్య శిబిరం నిర్వహించారు. పరీక్షలు నిర్వహించి మందులు అందజేశారు. ఈ సందర్భంగా సీజనల్ వ్యాధుల పట్ల అవగాహన కల్పించారు. గ్రామంలో డ్రైడే చేపట్టి నీటి నిల్వలను తొలగించారు. పరిసరాల పరిశుభ్రతను పాటించాలని సూచించారు. గర్భిణులు పౌష్టికాహారం తీసుకోవాలని పేర్కొన్నారు. కార్యక్రమంలో ఎంఎల్‌హెచ్‌పీ వైద్యురాలు ప్రియాంక, సిబ్బంది తిరుపతిరెడ్డి, రాజు, రజిత, లక్ష్మి ఉన్నారు.

ఎస్సై బదిలీ

భూపాలపల్లి, న్యూస్‌టుడే: భూపాలపల్లి పోలీసు స్టేషన్‌లో విధులు నిర్వర్తిస్తున్న ఎస్సై సందారాణి బదిలీ అయ్యారు. ఈ మేరకు మల్టీజోన్ ఐజీ చంద్రశేఖర్‌రెడ్డి సోమవారం ఉత్తర్వులు జారీ చేశారు. 14 నెలల నుంచి భూపాలపల్లి ఠాణాలో ఎస్సైగా ఆమె బాధ్యతలు నిర్వహించారు. అనేక సమస్యల పరిష్కారానికి కృషి చేశారు. సాధారణ బదిలీల్లో భాగంగా సందారాణి రామగుండం బదిలీ అయినట్లు ఉత్తర్వుల్లో పేర్కొన్నారు.

ఇందిరమ్మ గ్రామ కమిటీ ఎన్నిక

మొగుళ్లపల్లి, న్యూస్‌టుడే: ఇందిరమ్మ గ్రామ కమిటీని ఏకగ్రీవంగా ఎన్నుకున్నట్లు కాంగ్రెస్ మొగుళ్లపల్లి పట్టణ అధ్యక్షుడు క్యాతరాజు రమేష్ తెలిపారు. సోమవారం మండల కేంద్రం శివారులోని సమ్మక్క-సారలమ్మ ఆలయ ప్రాంగణంలో కాంగ్రెస్ నాయకులు, కార్యకర్తల సమక్షంలో కమిటీని ఎన్నుకున్నారు. గ్రామ శాఖ సభ్యులుగా క్యాతరాజు విజయ, మోరె రమాదేవి, నడిగోటి రాము, పడిదల ప్రకాష్‌రావు, బండారి కొమురయ్యను ఎన్నుకున్నారు. కార్యక్రమంలో చిట్యాల మార్కెట్ కమిటీ వైస్ ఛైర్మన్ రఫీ, నాయకులు ఎర్రబెల్లి పున్నంచందర్ రావు, ఏలేటి శివారెడ్డి, మల్సాని రాజేశ్వర్‌రావు, మోరె జయపాల్‌రెడ్డి, అన్నారెడ్డి, భిక్షపతి, శ్రీనివాస్, మహేందర్, నరేష్, తిరుపతి, సునీల్, తదితరులు పాల్గొన్నారు.

అంబేడ్కర్ విగ్రహానికి క్షీరాభిషేకం

టేకుమట్ల, చిట్యాల, న్యూస్‌టుడే: డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ ఆశయాలను ప్రతి ఒక్కరూ కొనసాగించాలని అంబేడ్కర్ యువజన సంఘం రాష్ట్ర ప్రచార కార్యదర్శి పుల్ల మల్లయ్య అన్నారు. అంబేడ్కర్ బౌద్ధమతాన్ని స్వీకరించిన రోజును పురస్కరించుకుని సోమవారం టేకుమట్ల, చిట్యాల మండల కేంద్రాల్లో ఆయన విగ్రహానికి పూలమాలలు వేశారు. కార్యక్రమంలో ఏఐవైఎస్ చిట్యాల మండలాధ్యక్షుడు సరిగొమ్ముల రాజేందర్, టేకుమట్ల గ్రామ కమిటీ అధ్యక్షుడు మచ్చ ప్రభాకర్, నాయకులు వైనాల రవీందర్, దాసారపు సదానందం, వీరేశం, ఎడ్ల రమేశ్, కనకం తిరుపతి, తదితరులు పాల్గొన్నారు.

ఐకాస నాయకులతో కార్మికులకు అన్యాయం

కమలాపురం(మంగపేట), న్యూస్‌టుడే: కార్మికులకు రావాల్సిన జీతాలు, ఇతర అలవెన్సుల విషయంలో బిల్టు కార్మిక ఐకాస నాయకులు క్లారిటీ ఇవ్వాలని పలువురు కార్మికులు డిమాండ్ చేశారు. సోమవారం మంగపేట మండలంలోని కమలాపురం గ్రామంలో కార్మికులు పంజాల సత్యనారాయణ, బత్తుల వెంకటనారాయణ, గూడ యాదగిరి, గులగట్టు విజయరావు స్థానిక విలేకర్లతో మాట్లాడారు. నిన్నటి వరకు కార్మికులకు అన్యాయం చేయలేదని, చెప్పిన ఐకాస నాయకులు ఎన్సీఎల్టీ కోర్టు మోసం చేసిందని ఎందుకంటున్నారని ప్రశ్నించారు. 650 మంది కార్మికుల తరఫున ఎన్నుకొని, యాజమాన్యంతో మాట్లాడాలని పంపితే, యాజమాన్యం ఇచ్చిన ముడుపులకు ఆశపడి కార్మికుల కుటుంబాలను రోడ్డున పడేసి ఏమీ తెలియని అమాయకుల్లా మాట్లాడుతున్నారని ఆవేదన వ్యక్తంచేశారు. ఈ విషయంపై మంత్రి ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లి న్యాయం చేయాలని, లేదంటే కార్మికులందరం కలిసి పెద్దఎత్తున ఆందోళన కార్యక్రమాలు చేస్తామని హెచ్చరించారు.

ఉరేసుకున్న బాధితుడికి ఊపిరిపోసిన 108 సిబ్బంది

ఎంజీఎం ఆసుపత్రి, న్యూస్‌టుడే: ఉరేసుకొని అపస్మారక స్థితికి వెళ్లిన బాధితుడికి 108 సిబ్బంది సకాలంలో స్పందించి ఊపిరిపోశారు. ఈ ఘటన సోమవారం వరంగల్ కాశీబుగ్గలో జరిగింది. 108 ఈఎంటీ శ్రీకాంత్, పైలెట్ సాంబయ్య తెలిపిన వివరాల ప్రకారం.. కాశీబుగ్గ మదీనా వీధికి చెందిన బూర స్వామాట్(37) మానసిక సమస్యతో తన ఇంట్లో చున్నీతో ఉరేసుకున్నాడు. ఇరుగుపొరుగు గమనించి వెంటనే 108కి సమాచారం ఇచ్చారు. స్పందించిన 108 ఈఎంటీ శ్రీకాంత్ ఘటనా స్థలానికి వెళ్లారు. అప్పటికే అపస్మారక స్థితిలో ఉన్న బాధితుడికి వైద్యుల సూచనల మేరకు సీపీఆర్ చేశారు. గుండె స్పందించడంతో వెంటనే అంబులెన్సులో ఎంజీఎం ఆసుపత్రికి తరలించారు. ప్రస్తుతం బాధితుడు స్వామాట్ ఎంజీఎంలో చికిత్స పొందుతున్నాడు. సకాలంలో స్పందించి.. ప్రాణాలు కాపాడిన 108 సిబ్బందిని స్థానికులు అభినందించారు.

నూనె గింజల పంటలపై దృష్టి సారించండి

మామునూరు, న్యూస్‌టుడే: నూనెగింజల పంటలను సాగు చేయాలని ప్రోగ్రాం కో-ఆర్డినేటర్ డా.రాజన్న రైతులకు సూచించారు. సోమవారం వరంగల్ జిల్లా పరిధి మామునూరు కృషి విజ్ఞాన కేంద్రంలో సామూహిక ప్రథమ శ్రేణి ప్రదర్శనలో భాగంగా యాసంగిలో సాగు చేసే వేరుసెనగ పంటల్లో చీడపీడలపైన రైతులకు శిక్షణ కార్యక్రమాన్ని నిర్వహించారు. నూనెగింజ పంటలో సుస్థిరత సాధించాలని సూచించారు. తెలంగాణ రాష్ట్రంలో సుమారుగా 1.6 నుంచి 1.7 లక్షల హెక్టార్లలో నూనె గింజల పంట సాగవుతుందని తెలిపారు. శిక్షణ పొందిన రైతులకు విత్తనాలు పంపిణీ చేశారు. కార్యక్రమంలో శాస్త్రవేత్తలు డా.సౌమ్య, సాయికిరణ్, గణేష్, శశాంక్, హర్ష, సాయిచంద్, రైతులు పాల్గొన్నారు.

అసంపూర్తి నిర్మాణంతో అవస్థలు



మండల కేంద్రంలో గణేష్ నగర్‌లో సీసీ రోడ్డు అసంపూర్తిగా నిర్మించారు. దీంతో రోడ్డుపై మురుగు నీరు నిలిచి వాహనదారులు ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. ప్రధాన రహదారి పక్కన మట్టి కొట్టుకుపోయి కోతకు గురై ప్రమాదకరంగా ఉంది. వెంటనే పనులు చేపట్టాలని స్థానికులు కోరుతున్నారు.

–న్యూస్‌టుడే, కాటారం(భూపాలపల్లి జిల్లా)

ఇళ్ల పట్టాలు అందించాలని వినతి



చిట్యాల, న్యూస్‌టుడే: మండలంలోని కైలాపూర్ శివారు శాంతినగర్‌లోని ప్రభుత్వ భూమిలో గుడిసెలు వేసుకున్న తమకు ఇళ్ల పట్టాలు మంజూరు చేయాలని సోమవారం గుడిసెవాసులు కలెక్టర్ రాహుల్ శర్మకు వినతిపత్రం అందజేశారు. నిరుపేదలమైన మేము కైలాపూర్ శివారు శాంతినగర్ ప్రభుత్వ భూమిలో 20 ఏళ్ల క్రితం గుడిసెలు వేసుకున్నామని, పలుమార్లు సంబంధిత అధికారులను, ప్రజాప్రతినిధులను కలిసి పట్టాలు ఇవ్వాలని కోరినట్లు చెప్పారు. గతంలో రెవెన్యూ అధికారులు సర్వే చేసి పట్టాలు ఇచ్చేందుకు కలెక్టర్ దృష్టికి తీసుకెళ్తామని చెప్పినట్లు పేర్కొన్నారు. ఇప్పటికైనా ఉన్నతాధికారులు స్పందించి పట్టాలు మంజూరు చేసి విద్యుత్తు తాగునీరు సరఫరా చేయాలని కోరారు.

మేడిగడ్డ బ్యారేజీ వద్ద పోలీసుల తనిఖీలు



మహదేవపూర్, న్యూస్‌టుడే: కాళేశ్వరం ప్రాజెక్టులోని మేడిగడ్డ బ్యారేజీ వద్ద సోమవారం రాత్రి పోలీసులు విస్తృతంగా తనిఖీలు చేపట్టారు. మహదేవపూర్ సీఐ రాంచంద్రరావు, ఎస్సై పవన్‌కుమార్ నేతృత్వంలో పోలీసులు ముమ్మరంగా గాలింపు చర్యలు చేపట్టారు. తెలంగాణ-మహారాష్ట్ర సరిహద్దు ప్రాంతం కావడంతో రాకపోకలు సాగించే వాహనాలను తనిఖీ చేశారు. అనుమానిత వ్యక్తుల సమాచారం తీసుకొని వదిలిపెట్టారు. సరైన పత్రాలు లేని వాహనాలకు జరిమానా విధించారు. పెద్దంపేటలో ప్రజలతో సమావేశం ఏర్పాటు చేసి నిఘా నేత్రాలను ప్రారంభించారు.

టీయూఎఫ్ జిల్లా అధికార ప్రతినిధిగా రాజయ్య



భూపాలపల్లి, న్యూస్‌టుడే: తెలంగాణ ఉద్యమకారుల ఫోరం (టీయూఎఫ్) జిల్లా అధికార ప్రతినిధిగా మల్హర్ మండలానికి చెందిన బోయిన రాజయ్య యాదవ్‌ను నియమించినట్లు సోమవారం టీయూఎఫ్ రాష్ట్ర అధ్యక్షుడు డాక్టర్. చీమ శ్రీనివాస్ ఒక ప్రకటనలో తెలిపారు. జిల్లా వ్యాప్తంగా తెలంగాణ ఉద్యమకారుల సమస్యల పరిష్కారం కోసం తన వంతు కృషి చేస్తానని ఈ సందర్భంగా రాజయ్య యాదవ్ తెలిపారు.

పత్తి రైతుల కోసం వాట్సాప్ నెంబరు



ఈనాడు, వరంగల్ : పత్తి రైతుల కోసం మార్కెటింగ్ శాఖ ఈ ఏడాది ఒక వాట్సాప్ నెంబర్‌ను (8897281111) అందుబాటులోకి తీసుకొచ్చింది. కొనుగోళ్లు ప్రారంభమైన నేపథ్యంలో ప్రవేశపెట్టిన ఈ వాట్సాప్ విధానం వల్ల రైతులకు అనేక ప్రయోజనాలు ఉన్నాయంటోంది. ఈ అప్లికేషన్ వల్ల అన్నదాతలు పత్తి పంటతో రోజుల తరబడి సీసీఐ కేంద్రాలున్న మిల్లుల వద్ద వేచి చూసే పని ఉండదు. ఏ కేంద్రం వద్ద ఎంత సరకు ఉంది, వేచి చూడాల్సిన సమయం ఎంతనేది కూడా ముందే తెలుస్తుంది. దీని వల్ల రైతులు తమ దగ్గర్లోని కేంద్రంలో ఎక్కడ వేచి చూసే సమయం తక్కువుందో అక్కడికి వెళ్లే విధంగా ఈ వాట్సప్ అప్లికేషన్ రూపొందించారు. పైన పేర్కొన్న మొబైల్ నెంబర్‌తో వాట్సప్‌లో రైతులు 'హెచ్‌ఐ' అని టైప్ చేస్తే వెంటనే 'వన్ సాఫ్ట్ సిస్టమ్ ప్రైవేట్ లిమిటెడ్' పేరుతో అది తెరచుకుంటుంది. ఇందులో ఇంగ్లిషు, తెలుగు, హిందీ మూడు భాషల్లో కావాల్సిన దాన్ని ఎంపిక చేసుకోవచ్చు. ఉదాహరణకు తెలుగు ఎంపిక చేసుకుంటే 'అర్హత తనిఖీ', 'విక్రయ సమాచారం', 'తక్‌పట్టి వివరాలు', 'కేంద్రంలో వేచి ఉండే సమయం', ఇలా నాలుగు ఐచ్ఛికాలు కనిపిస్తాయి. రైతులు సాగు చేసిన పత్తి వివరాలు, రైతు ఎన్ని క్వింటాళ్ల వరకు విక్రయించుకునేందుకు అర్హత ఉందనేది మొదట కనిపిస్తుంది. ఒకవేళ రైతులు పత్తి విక్రయిస్తే ఎంత సరకు విక్రయించారు, చెల్లింపు డబ్బుల వివరాలు కనిపిస్తాయని మార్కెటింగ్ వర్గాలు తెలిపాయి.

నిందితులను కఠినంగా శిక్షించాలి

మహదేవపూర్, న్యూస్‌టుడే: వరంగల్ దేశాయిపేటలో మహాత్మా జ్యోతిరావు పులే విగ్రహం ధ్వంసం చేసిన దుండగులను కఠినంగా శిక్షించాలని బీసీ సంక్షేమ సంఘం జాతీయ ప్రధాన కార్యదర్శి పంతకాని శ్రీనివాస్ పేర్కొన్నారు. ఆ ప్రదేశంలో కొత్త విగ్రహాన్ని ఏర్పాటు చేయించిన పోలీస్ అధికారి చొరవ హర్షణీయమన్నారు. ఇలాంటి ఘటనలకు పాల్పడుతున్న వారిపై చట్టపరంగా చర్యలు తీసుకోవాలని ఆయన కోరారు.

పోగొట్టుకున్న చరవాణి అప్పగింత



మొగుళ్లపల్లి, న్యూస్‌టుడే: పోగొట్టుకున్న చరవాణిని గుర్తించి బాధితునికి పోలీసులు అప్పగించారు. ఎస్సై అశోక్ తెలిపిన వివరాల ప్రకారం మండలంలోని ముల్కలపల్లి గ్రామానికి చెందిన ఓనపాకల రాజు చరవాణి ఆదివారం కనిపించ పోవడంతో సోమవారం ఠాణాలో ఫిర్యాదు చేశాడు. పోలీసులు స్పందించి రెండు గంటల వ్యవధిలో సీఈఐఆర్ పోర్టల్ ద్వారా ఫోను కనుగొని బాధితుడికి అప్పగించారు.

బాధిత కుటుంబానికి పరామర్శ

కొత్తపల్లిగోరి(రేగొండ), న్యూస్‌టుడే: మండల కేంద్రానికి చెందిన బి.పోశాలు ఇటీవల అనారోగ్యంతో మృతి చెందగా బాధిత కుటుంబ సభ్యులను సోమవారం ఎమ్మెల్యే గండ్ర సత్యనారాయణరావు పరామర్శించారు. నేతలు సంతోష్, రమేష్, ప్రభాకర్, రాజయ్య, తిరుపతి తదితరులు ఉన్నారు.

టేకుమట్ల: మండలంలోని వెల్లంపల్లికి చెందిన సొల్లేటి రాములు, గీస హరీశ్ ఆదివారం ప్రమాదవశాత్తు చలివాగులో మునిగి మృతి చెందిన విషయం తెలిసిందే. సోమవారం ఎమ్మెల్యే గండ్ర సత్యనారాయణరావు బాధిత కుటుంబాన్ని పరామర్శించారు. ఆయన వెంట కాంగ్రెస్ మండలాధ్యక్షుడు కోటగిరి సతీశ్, మాజీ జడ్పీటీసీ సభ్యుడు పులి తిరుపతిరెడ్డి, కాంగ్రెస్ జిల్లా ప్రధాన కార్యదర్శి వైనాల రవీందర్, కృష్ణారెడ్డి, మండల ఉపాధ్యక్షుడు కొమురయ్య, ప్రధాన కార్యదర్శి ఎడ్ల రమేశ్, కిరణ్ తదితరులు పాల్గొన్నారు.

వివాహిత ఆత్మహత్య

నల్లబెల్లి, న్యూస్‌టుడే: కడుపునొప్పి భరించలేక వివాహిత గాదం మంజుల(30) ఆత్మహత్యకు పాల్పడింది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. నల్లబెల్లి మండలం లెంకాలపల్లికి చెందిన మంజుల కొన్ని రోజులుగా కడుపునొప్పితో బాధ పడుతోంది. ఈనెల 13న ఇంట్లో పురుగుల మందు తాగింది. కుటుంబ సభ్యులు ఆమెను నర్సంపేటలోని ప్రభుత్వ ఆసుపత్రికి తరలిస్తుండగా మార్గంమధ్యలో మృతి చెందింది. మృతురాలి సోదరుడు నాగరాజు ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు ఎస్సై ప్రశాంత్‌బాబు తెలిపారు.

బావిలో పడి మహిళ మృతి



అనిత(పాత చిత్రం)

సంగెం, న్యూస్‌టుడే: మానసిక స్థితి సరిగ్గా లేని మహిళ వ్యవసాయ బావిలో పడి మృతి చెందిన సంఘటన సోమవారం సంగెం మండలం కాట్రపల్లిలో చోటుచేసుకుంది. ఎస్సై నరేశ్ తెలిపిన వివరాల ప్రకారం.. దుగ్గొండి మండలం తిమ్మంపేట్‌కు చెందిన ఉండ్రాతి అనిత(35) పదేళ్లుగా మానసిక సమస్యతో బాధ పడుతోంది. దసరా పండగ సందర్భంగా కాట్రపల్లిలోని పుట్టింటికి వచ్చింది. ఆమె ఆదివారం రాత్రి ఇంటి నుంచి బయటకు వెళ్లి తిరిగిరాలేదు. కుటుంబ సభ్యులు సోమవారం ఉదయం సమీపంలోని వ్యవసాయ బావిలో ఆమె మృతదేహాన్ని గుర్తించి వెలికితీశారు. మృతురాలి తండ్రి పల్లకొండ పాపయ్య ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు ఎస్సై తెలిపారు.

రైలు నుంచి పడి ప్రయాణికుడి దుర్మరణం

రఘునాథపల్లి, న్యూస్‌టుడే: ప్రమాదవశాత్తు ప్రయాణికుడు రైలు నుంచి కింద పడి మృతి చెందాడు. ఈ సంఘటన రఘునాథపల్లి రైల్వే స్టేషన్ సమీపంలో సోమవారం చోటుచేసుకుంది. జనగామ రైల్వే పోలీసుల కథనం ప్రకారం.. గుర్తు తెలియని వ్యక్తి (40) సోమవారం గుర్తు తెలియని రైలు నుంచి జారి కింద పడి అక్కడికక్కడే మృతి చెందాడు. సిబ్బంది రైల్వే పోలీసులకు సమాచారం అందించడంతో విచారణ చేపట్టారు. మృతుడి కుడి చేతిపై 'నాన్న' అని పచ్చబొట్టు ఉంది. అతని వద్ద ఎలాంటి వివరాలు లభించలేదు. మృతదేహాన్ని జనగామ ప్రాంతీయ ఆసుపత్రి పోస్టుమార్టం గదిలో భద్రపరిచారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నామని, ఆచూకీ తెలిసిన వారు 9440027342 నెంబర్‌కు సమాచారం ఇవ్వాలని రైల్వే హెడ్ కానిస్టేబుల్ రమణారెడ్డి, కానిస్టేబుల్ నరేశ్ కోరారు.

దృష్టి మరల్చి.. నగదు అపహరించి



సంఘటన స్థలాన్ని పరిశీలిస్తున్న సీఐ మహేందర్‌రెడ్డి, తదితరులు

దేవరుప్పుల రూరల్, న్యూస్‌టుడే: ద్విచక్రవాహనంపై నగదుతో వెళ్తున్న ఒకరి దృష్టి మరలించిన ఇద్దరు దుండగులు రూ.40వేలు ఎత్తుకెళ్లిన సంఘటన సోమవారం సాయంత్రం దేవరుప్పుల మండలం సీతారాంపురం బస్టాండ్ శివారులో జరిగింది. సీఐ మహేందర్‌రెడ్డి, ఎస్సై చెన్నకేశవులు తెలిపిన ప్రకారం.. రంభోజీగూడానికి చెందిన పైండ్ల మల్లయ్య సింగరాజుపల్లిలోని ఏపీజీవీ బ్యాంక్ నుంచి రూ.40వేలు డ్రా చేసి తన వాహనంపై ఇంటికి బయల్దేరాడు. సీతారాంపురం సమీపంలోని దుర్గమ్మ గుడి వద్ద ఇద్దరు గుర్తు తెలియని వ్యక్తులు డబ్బులు కింద పడిపోయాయని చెప్పగా, మల్లయ్య వాటిని తీసుకునే ప్రయత్నం చేశాడు. ఆ సమయంలో మల్లయ్య వాహనంలో ఉన్న రూ.40వేలను తీసుకుని అక్కడి నుంచి పరారయ్యారు. బాధితుడి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు పేర్కొన్నారు.

కార్మికుల సంక్షేమంపై ప్రత్యేక దృష్టి

బొగ్గుబాయి ముచ్చట్లు

యైటింక్లయిన్‌కాలనీ: సింగరేణి పరిరక్షణ మనందరి బాధ్యత అనే విషయాన్ని ప్రతి ఒక్కరు గ్రహించాలని ఎమ్మెల్యే మక్కాన్‌సింగ్ అన్నారు. సోమవారం ఆర్జీ-2 డివిజన్‌లోని ఓసీపీ-3 ప్రాజెక్టు ఆవరణలో నిర్వహించిన ఉజ్వల 'సింగరేణి-ఉద్యోగుల పాత్ర' అంశంపై నిర్వహించిన సమావేశానికి ఎమ్మెల్యే ముఖ్యఅతిథిగా హాజరై మాట్లాడారు. కార్మికుల సంక్షేమ ఫలాలు, అభివృద్ధి పనులు, ప్రభావిత పునరావాస గ్రామాలకు చేయూత తదితర అంశాలపై ప్రభుత్వం ప్రత్యేక దృష్టి సారిస్తోందన్నారు. అనంతరం కార్మికులతో కలిసి ఎమ్మెల్యే మక్కాన్‌సింగ్, ఏసీపీ రమేష్, జీఎం సూర్యనారాయణలు భోజనం చేశారు.

ఉపాధి శిక్షణకు యువత తరలింపు

గోదావరిఖని: స్వయం ఉపాధిలో శిక్షణకు దరఖాస్తు చేసుకున్న 150 మంది నిరుద్యోగ యువకులను బస్సు ద్వారా హైదరాబాద్ జీఎంఆర్ వరలక్ష్మి ఫౌండేషన్‌కు సోమవారం పంపించారు. ఈ మేరకు సింగరేణి టీటీసీ కేంద్రంలో ఏర్పాటుచేసిన కార్యక్రమానికి ఎమ్మెల్యే మక్కాన్‌సింగ్, జిల్లా కలెక్టర్ కోయ శ్రీహర్ష, ఆర్జీ-1 జీఎం లలిత్‌కుమార్, ఖని ఏసీపీ రమేశ్‌లు హాజరయ్యారు. రెండు నెలల పాటు ఉచితంగా శిక్షణ ఇవ్వడంతోపాటు భోజన, వసతి సౌకర్యం కల్పించనున్నట్లు తెలిపారు. గుర్తింపు సంఘం నాయకులు పాల్గొన్నారు.

పార్టీ కోసం పనిచేసే వారికే పదవులు



సమావేశంలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే కడియం శ్రీహరి

స్టేషన్‌ఘన్‌పూర్, న్యూస్‌టుడే: నిత్యం ప్రజల్లో ఉంటూ పార్టీ కోసం పని చేసే వారినే పదవులు వరిస్తాయని ఎమ్మెల్యే కడియం శ్రీహరి అన్నారు. సోమవారం స్టేషన్‌ఘన్‌పూర్‌లో నిర్వహించిన వ్యవసాయ మార్కెట్ కమిటీ నూతన పాలకవర్గం ప్రమాణ స్వీకారోత్సవ కార్యక్రమానికి ఎమ్మెల్యే ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. ఛైర్మన్‌గా జూలుకుంట్ల లావణ్య, వైస్ ఛైర్మన్‌గా నూకల ఐలయ్య, డైరెక్టర్లతో జిల్లా మార్కెటింగ్ అధికారి బి.నరేంద్ర ప్రమాణ స్వీకారం చేశారు. సమావేశంలో కడియం మాట్లాడుతూ.. పార్టీ కోసం చాలా మంది పని చేస్తున్నారని, వారి పూర్తి సమాచారం తన వద్ద ఉందని, రానున్న రోజుల్లో తప్పకుండా అవకాశం వస్తుందని తెలిపారు. నాతో పాటు కాంగ్రెస్‌లో చేరిన వారు బాధపడిన పర్వాలేదని, వారిని ఒప్పించి మొదటి నుంచి పార్టీ జెండా మోసిన వారికి మార్కెట్ కమిటీలో చోటు కల్పించినట్లు వివరించారు. ఏఐసీసీ, పీసీసీ ఆహ్వానం మేరకే తాను కాంగ్రెస్‌లో చేరానని.. నియోజకవర్గంలోని ఏడు మండలాలల అభివృద్ధిపై ప్రత్యేక ఏజెండా ఉందని చెప్పారు. పార్టీలో గ్రూపు రాజకీయాలకు తావులేదని అలాంటి వాటికి పాల్పడితే సహించేది లేదన్నారు. ఈ నియోజకవర్గంలో ఏ పార్టీ ఎమ్మెల్యే గెలిస్తే ఆ పార్టీ రాష్ట్రంలో అధికారంలోకి వచ్చేది.. కానీ ఈ సారి తాను ఎమ్మెల్యేగా గెలిచిన పార్టీ మాత్రం అధికారంలోకి రాలేదని, ఎప్పటి నుంచో వస్తున్న ఆచారానికి బ్రేక్ పడకూదని అధికారంలో ఉన్న కాంగ్రెస్‌లోకి వెళ్లానని పేర్కొన్నారు. కార్యక్రమంలో మార్కెట్ కార్యదర్శి జున్ను భాస్కర్, డైరెక్టర్లు భాస్కుల కిరణ్, యశ్వంత్, వెంకటేశ్వర్లు, సుధాకర్, నాయకులు శిరీష్‌రెడ్డి, వెంకటేశ్వర్‌రెడ్డి, నరేందర్ రెడ్డి, ఇంద్రరెడ్డి, సతీష్, ఫాతికుమార్, తదితరులు పాల్గొన్నారు.

ప్రమాణ స్వీకారం చేయని డైరెక్టర్..

డివిజన్ కేంద్రంలోని వ్యవసాయ మార్కెట్ కమిటీ డైరెక్టర్‌గా నియమితులైన కాసాని బొందయ్య సోమవారం పాలకవర్గ ప్రమాణ స్వీకార కార్యక్రమంలో ప్రమాణ స్వీకారం చేయలేదు. మార్కెట్ కమిటీలో ఛైర్మన్ లావణ్యతో పాటు వైస్ ఛైర్మన్, 12 మంది డైరెక్టర్లు ఉండగా, 11 మంది ప్రమాణ స్వీకారం చేశారు. బొందయ్య గతంలో ఛైర్మన్ పదవి ఆశించినా.. రాకపోవడం, వైస్ ఛైర్మన్ సైతం రాకపోవడంతో నిరాశ చెంది ఈ నెల 10న మార్కెట్ కార్యదర్శికి తన రాజీనామా పత్రాన్ని అందజేశారు.

రామప్పలో పర్యాటకుల సందడి



ప్రత్యేక అలంకరణలో రామలింగేశ్వరుడు

కాకతీయుల కళాక్షేత్రమైన రామప్పకు పర్యాటకులు సోమవారం అధిక సంఖ్యలో తరలివచ్చారు. దసరా సెలవులు ముగియనున్న నేపథ్యంలో ఉమ్మడి వరంగల్ జిల్లాతో పాటు హైదరాబాద్, కరీంనగర్, ఖమ్మం తదితర ప్రాంతాల నుంచి తరలిరావడంతో.. రామప్ప పరిసర ప్రాంతాల్లో సందడి నెలకొంది. ఆలయ అర్చకులు హరీశ్‌శర్మ స్వామివారిని ప్రత్యేకంగా అలంకరించారు. రామలింగేశ్వరుడి దర్శనం కోసం బారులుతీరి స్వామివారిని దర్శించుకొని ప్రత్యేక పూజలు చేశారు. వేద పండితులు స్వామివారి తీర్థప్రసాదాలు అందజేసి ఆశీర్వదించారు. అనంతరం టూరిజం గైడ్లు ఆలయ చరిత్ర, శిల్పకళా వైభవం గురించి వివరించారు. కుటుంబ సమేతంగా గార్డెన్‌లో ఉల్లాసంగా గడిపారు. అక్కడ నుంచి రామప్ప సరస్సు కట్టకు చేరుకుని సరస్సులో బోటు షికారు చేస్తూ.. సందడి చేశారు. – న్యూస్‌టుడే, వెంకటాపూర్



సరస్సులో బోటు షికారు చేస్తూ..

రోడ్డు ప్రమాదంలో ఒకరికి తీవ్ర గాయాలు

కాటారం, న్యూస్‌టుడే: మండల కేంద్రంలోని కాటారం-మహదేవపూర్ రహదారిపై సోమవారం జరిగిన రోడ్డు ప్రమాదంలో వ్యక్తి తీవ్రంగా గాయపడ్డాడు. స్థానికులు తెలిపిన వివరాల ప్రకారం.. నస్తూర్‌పల్లి ప్రభుత్వ ప్రాథమిక పాఠశాలలో ఉపాధ్యాయుడిగా పని చేస్తున్న కురుసం అశోక్ ద్విచక్ర వాహనంపై ఇంటికి వెళ్తుండగా మహదేవపూర్ రోడ్డు వైపు రోడ్డు దాటుతుండగా గుర్తు తెలియని కారు ద్విచక్రవాహనాన్ని ఢీకొట్టింది. ప్రమాదంలో అశోక్ తీవ్రంగా గాయపడ్డాడు. చికిత్స నిమిత్తం వరంగల్‌కు తరలించారు.